# సాహితీ చంద్రికలు

### (వచన కవిత్వం)

## చంద్రకళ. దీకొండ

## మహతీ సాహితీ కవి సంగమం

### కరీంనగరం

### డా.అడిగొప్పుల సదయ్య గారి ఆధ్వర్యాన

Book Title : SAHITHI CHANDRIKALU
Writer Name : Chandrakala Dhekonda

Copy rights © Author
First Edition : January, 2024

ISBN Number : 978-93-6004-766-5

Price :

Copies : 500
Address for Copies: Chandrakala Dhekonda

Publications : Thapasvi Manoharam Publications

**Book Design & Cover Design, DTP & Printing**:

Thapasvi Manoharam Publications
Reg. No : U22300TG2022PTC161797
Kondapur, Hyderabad.
Mail.ID: manoharam. editor@gmail.com
https:..thapasvimanoharam.com.
Phone Number: +91 7893467516

# అంకితం



నా సాహితీ వ్యాసంగం దిన దిన ప్రవర్థమానమయ్యేందుకు నాంది పలికిన మా సుపుత్రిక డా.సింధుజ బోలుకొండ, రేడియాలజిస్ట్ కు కృతజ్ఞతలతో నా ఈ కవితా సంపుటిని ప్రేమపూర్వకంగా అంకితమిస్తూ...

చంద్రకళ. దీకొండ

# అభినందనలు



శ్రీమతి చంద్రకళ. దీకొండ గారు సమకాలీన కవుల.కవయిత్రులలో పేరుపొందిన కవిశిఖామణి.వీరు మా మహతీ సాహితీ కుటుంబ సభ్యులైనందుకు మాకు గర్వకారణం.మహతీ సాహితీ కవిసంగమం–కరీంనగరం యొక్క వంద కవితల పండుగలో పాల్గొని శతకమును పూర్తి చేసిన సందర్భంగా చంద్రకళ. దీకొండ గారికి శుభాకాంక్షలు.

శ్రీమతి చంద్రకళ. దీకొండ గారు మహతీ సాహితీలో తమ విలువైన సమయాన్నికేటాయిస్తూ క్రమం తప్పకుండా క్రమశిక్షణగా ఎన్నో రచనలు చేసారు. వీరు మహతీ సాహితీ ద్వారా ఎన్నో ప్రశంసాపత్రాలు, సన్మానాలు, బిరుదులు పొందారు.

శ్రీమతి చంద్రకళ. దీకొండగారు వంద కవితల పండుగలో పాల్గొని అద్భుతమైన రచనలు చేశారు. వాటిలో మచ్చుకు రెండు:

1. మనుషుల్లో దేవుడు(వచనం) 18.8.2023(5)

ఆపదలందు తానున్నానని ధైర్యమిచ్చేవాడు...
అన్నార్తులకు, అనాథలకు సాయమందించేవాడు...
ఉన్నత వ్యక్తిత్వంతో అలరారేవాడు!

ప్రశాంత చిత్తంలో...
పసిపాప బోసినవ్వులో...
పరోపకార ప్రకృతిలో కొలువైనవాడు!

దుష్టశిక్షణ, శిష్ట రక్షణ చేయువాడు...
మానవత్వానికి ప్రతిరూపాలైన వైద్యులు,

సేవకులు, సిపాయిలు, అన్నదాతల
హృదయాలలో దాగున్నవాడు...
ప్రత్యక్షంగా తల్లిదండ్రులు, గురువుల
రూపంలో దర్శనమిచ్చువాడు!

నీతీ నిజాయితీల ప్రతిరూపం...
విశ్వ ప్రేమకు, శాంతికి నెలవైన జ్ఞానదీపం!

సత్యంలో, నిస్వార్థ సేవలో...
దయ, కరుణ, కనికరం నిండిన
గుండెల్లో గుడి కట్టుకున్నవాడు!

మూఢభక్తిలో కాక స్వశక్తిలో...
ఆడంబరాలలో కాక ఆత్మవిశ్వాసంలో...
అందమైన రూపంలో కాక సుగుణంలో...
మానవత్వం పరిమళించే మంచిమనసుల్లో...
నిరాకారుడై... నిర్మలుడై...
నీలోనే... మానవ రూపంగానే...
సాక్షాత్కరించును...
మనుషుల్లో దేవుడు!

## 2. సార్థకతా సువాసన(వచనం) 25.9.2023(41)

నిధి చాల సుఖమా
రాముని సన్నిధి చాల సుఖమా
అనిన త్యాగరాజ కీర్తనను

నిండార రాజు నిద్రించు నిద్రయునొకటే
అండనే బంటు నిద్ర అదియు నొకటే

అందరికీ శ్రీహరే అంతరాత్మ అని చాటిన అన్నమాచార్యుని సంకీర్తనను జ్ఞప్తియందుంచుకొని!

కొనగోటి మీద జీవితమే అయినా
నఖచిత్రమై తళుకులీనాలి
బతకడం కాక జీవించాలి!

ఉన్న నాలుగునాళ్లూ
రాగ ద్వేషాలతో కుమిలిపోక
ప్రేమానురాగాలతో పరిమళించాలి!

ప్రకృతి నేర్పే పాఠాలను ఆకళింపు చేసుకొని
జీవితానికో సార్థకతా సువాసననద్దాలి!

కోమల హృదయ వీణియను శృతిచేసి
చిన్ని చిన్ని ఆనందాల మెట్లపై
చిరునవ్వుల కొనగోట మీటుతూ
అందమైన అనుభూతుల రాగాలు పలికించాలి!

ప్రతి ఉదయమూ క్రొంగొత్త
ఉత్సాహంతో జీవిత
సంగీతసాధన చేయాలి
ఈతిబాధల అపశ్రుతులను సరిచేస్తూ
ఆదర్శవంతమైన పరోపకారార్థ
ప్రియరాగాలు ఆలపించాలి!

శ్రీమతి చంద్రకళ. దీకొండగారి ఈ పుస్తకరాజం తన కవితాసోయగంతో పాఠకలోకాన్ని అలరిస్తుందని ఆశిస్తున్నాను. వీరు తమ కవితాప్రతిభను ప్రదర్శిస్తూ మరిన్ని కవితాసంపుటులు వెలయించాలని ఆకాక్షిస్తూ...

మీ సాహితీ పిపాసి

డాక్టర్ అడిగొప్పుల సదయ్య
వ్యవస్థాపక అధ్యక్షుడు
మహతీ సాహితీ కవిసంగమం–కరీంనగరం
9963991125

# పీఠిక



"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరమ్"

పాఠక మహాశయులు అందరికీ నమస్సులు

శ్రీమతి దీకొండ చంద్రకళ గారు మహతీ సాహితీ కవిసంగమం, కరీంనగరం సమూహంలో ఎంతోకాలంగా తమ కవితలను పంచుకుంటున్నారు.. చిరపరిచితులైన వీరు గౌ.డా.శ్రీ. అడిగొప్పుల సదయ్యగారు నిర్వహించిన "వంద కవితల పండుగ" ప్రత్యేక కార్యక్రమంలో పాలుపంచుకోవడం చాలా ప్రశంసనీయం.. ఎంతో ప్రతిభ, దానికి తగ్గ అనుభవం.. జతగా పెనవేసుకుని ఉండడం అనే విషయం చాలా తక్కువ మందిలో ఉంటుంది.. అటువంటి వారిలో శ్రీమతి దీకొండ చంద్రకళ గారు ఒకరు.

వేరు మూలం అంటూ అమ్మ గొప్పతనాన్ని వర్ణించడంతో ప్రారంభమైన ఈ సంపుటి అక్షర సుమాలు అంటూ ఆలోచనల వనంలో పూసిన పువ్వుల గురించి వర్ణిస్తూ..100 వ కవితతో ముగిసింది.. ఇందులో మహిళల గొప్పతనం, వారు పడే కష్టాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు మొదలుకొని.. దేశభక్తి, దైవభక్తి, మానవ సంబంధాలు, ప్రకృతి పై ప్రేమ, ఆరోగ్యం, సామాజిక స్పృహ.. సాహిత్యం, కళలు.. ఇలా అన్నింటినీ కలుపుకుని రాయడం వీరికే చెల్లింది. నవరసాలకు స్థానం కల్పిస్తూ కవితల సంపుటిని వెలువరచేవారు చాలా అరుదుగా కనిపిస్తారు.

వీరు చేజారిన కాలం అనే కవితలో ఇలా అంటారు.. "తాకిన తొలిచూపుల మిక్చర్ పొట్లం విప్పి తరచి చూసాను.. ఆకర్షణో.. వ్యామోహమో.. నిజమైన ప్రేమో.." అంటూ మిస్సయిన ప్రేమలేఖ గురించి చెప్తారు.. నీ చుట్టూరా చూడు అనే ఒక కవితలో.. స్ఫూర్తి గురించి ఇలా అంటారు.."చిట్టి చీమ కూడా గట్టి స్ఫూర్తినే కలిగిస్తుంది.. తనకన్నా రెట్టింపు బరువును మోస్తుంది.." అంటారామె.. చూడగలిగే హృదయం నీకుంటే.. పరిశీలించగలిగే సహనాన్ని అలవరచుకుంటే అంతటా స్ఫూర్తి కనిపిస్తుంది"అని చెప్పడం చక్కటి స్ఫూర్తి వాక్యం. అదే విధంగా మిథ్యాడంబరం అనే మరో కవితలో మధ్యతరగతి జీవితాలను గడిపే వారిలో అక్కడక్కడా కనిపించే అప్పుల అప్పారావుల గురించి రాస్తారు.."అనుకోని ప్రమాదాలు, అవసరాలు మీదపడి, ఉన్నదంతా ఊడ్చుకుపోయాక రంగువెలసిన నక్క బాపతు అయ్యాక.." అంటూ డబ్బు లేనినాడు వారికి సత్యం ఎలా గోచరిస్తుందో చెబుతారు.

సహజంగా సైన్స్ ఉపాధ్యాయిని అయిన వీరు తమ కవితలలో.. సీతాకోక చిలుక రూపవిక్రియ నుండి.. శరీరాన్ని ఆశ్రయించుకుని బ్రతికే పరాన్న జీవులవరకు, ఆరోగ్యదీపాలు పేరిట వైద్యుల గురించి, సౌగంధికా పుష్పం పేరిట కలను నిజం చేసుకోవడం గురించి, చెదరని దీక్ష పేరిట శిల్పుల గురించి, రహస్య పేటిక పేరిట మనసు గురించి.. ఇలా విభిన్న అంశాలపై కవితలను రాశారు..

ఒక వ్యక్తి జీవితంలో వచ్చే కష్టాలను వ్యక్తిత్వ పరీక్షలు గా అభివర్ణించడంలో వీరి సకారాత్మక పోరాటపటిమ కనిపిస్తోంది.. "ఉలి దెబ్బలకు ఓర్చుకున్న శిలా శిల్పం అయినట్లు..సమ్మెట దెబ్బలు తిన్న బంగారం తీగ సాగినట్లు.. కష్టాలే మనిషి వ్యక్తిత్వాన్ని నిగ్గు తేల్చే పరీక్షలు" అంటారావిడ. ఇలా చెప్పుకుంటూ పోతే. ప్రతి కవితా ఒక ఆణిముత్యం.

శ్రీమతి దీకొండ చంద్రకళ గారు వ్రాసిన వందరోజుల.వందకవితల సంపుటి చాలా బాగుంది.. ఇందులో మొత్తం 100 కవితలు ఉన్నాయి.. ఒకదానితో మరోదానికి సంబంధం లేకుండా.. విభిన్నమైన రీతిలో కవితా వస్తువులను ఎంపిక చేసుకోవడంలోనే వీరి ప్రత్యేకత కనిపిస్తోంది.. ఒక్కరోజు కూడా విరామం తీసుకోకుండా.. నిరంతర కవితాయజ్ఞంలో పాల్గొని తమ మదిలోని భావాలకు రమ్యమైన అక్షరరూపం ఇచ్చిన వీరిని అభినందించక తప్పదు.. నేటితరం పాఠకులకు అర్ధమయ్యే రీతిలో.. సరళమైన భాషలో చక్కటి పదాలను ఉపయోగించి వీరు రాసిన ఈ సంపుటి అందరి ఆదరణను పొందుతుందని.. అనడంలో ఎటువంటి సందేహం లేదు.. శ్రీమతి దీకొండ చంద్రకళ గారు ఇటువంటి సంపుటములను ఎన్నో..మరెన్నో.. వెలువరించాలని కోరుతూ.. ఈ సంపుటికే మున్నుడిని రాసే అవకాశం నాకు లభించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ..

సాహిత్యాభినందనలతో..

మీ

వేణుగోపాలుడు..

పొర్ల వేణుగోపాల రావు

(కవి, రచయత, పలు సాహితీప్రక్రియల పండితుడు, సమీక్షకులు)

ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఎల్లారెడ్డిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లా.

ఫోన్: 6303469295

# ముందుమాట



వసుదేవ సుతం దేవం కంస చాణూర మర్దనం
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురమ్!

పాఠక మహాశయులకు నమస్సులు!

శ్రీమతి దీకొండ చంద్రకళ గారు నాకు సుపరిచితులు. స్నేహశీలి, మంచి మనిషి. ప్రస్తుతం మహతీ సాహితీ కవిసంగమం సమూహ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ డా. అడిగొప్పుల సదయ్యగారి ఆధ్వర్యంలో నిర్వహించబడిన వందరోజుల కవితా పండుగలో వందరోజులు వంద కవితలు, అనేక ఇతివృత్తములను తీసుకుని సునాయాసంగా వ్రాసి విజయ బావుటా ఎగురవేశారు.

వీరి పుస్తకమునకు ముందుమాట రాసే అవకాశం రావడం నేను సంతోషంగా భావిస్తున్నాను.

మొదటి కవిత వేరు మూలంలో "గర్భానమోసి, కుటుంబభారం తలకెత్తుకుంటుంది అమ్మ. ఆవేదనల ననుభవిస్తూ ఆనందం పంచుతుంది. సమస్యల కఠిన జలాన్ని తాను సేవించి, స్వచ్ఛమైన నీటిని ఇస్తుంది" అంటూ అమ్మకు పట్టం కట్టారు.

మనుషుల్లో దేవుడు కవితలో ఆపదలలో ధైర్యాన్నిచ్చేవాడంటూ ప్రారంభించి, వైద్యులు, సేవకులు, సిపాయిలు, అన్నదాతలు, తల్లి దండ్రులలో దైవం ఉన్నాడంటూ.. యువతరానికి నిర్దేశం చూపారు.

అసంకల్పితమే కవితలో మనకు తెలియకుండా జరిగే ఎన్నో సంజ్ఞల ద్వారా సమాచార మార్పిడి జరుగుతుందని తెలిపారు. ఉదా....తల ఊపితే సమ్మతం, భుజం తడితే ప్రశంస, కంటి చూపే శాసనం అంటూ అవయవాలతో చేసే సంకేతాలను తెలియజేశారు.

వట్టిపోతున్న మట్టి కవితలో మట్టిలో పుట్టి, మట్టిపై బతికి... ప్రకృతి వైపరీత్యాలకు కారణమై మట్టిని వట్టిపోయేటట్లు చేస్తున్నారు మనుషులు స్వార్థంతో అంటూ తన సామాజిక బాధ్యతను నిరూపించుకున్నారు.

"బడిలో బలపం చేతబట్టి దిద్దిన అక్షరం"
"భావి జీవితానికి బంగరు బాట వేస్తుంది" అంటూ అక్షరాల త్రోవ శీర్షికతో చదువు ప్రాముఖ్యతను కవిత్వీకరించారు.

సర్దుబాటు కవితలో
"మనసొకచోట మనువొకచోట మథనపడే ఇరు హృదయాలు
తప్పనిసరై అంతరంగపు అట్టడుగుకు నెట్టివేయబడే మూగప్రేమలు
సర్దుకుపోవాల్సిన కాపురాలు" అంటూ ప్రస్తుత కాపురాల పరిస్థితిని తెలియజేశారు.

రూప విక్రియ కవితలో
"మునురూపము అసహ్యకరమైన, మలిరూపము మనోహరము" అంటూ అల్లరిగా ఎగిరే సీతాకోకచిలుక గురించి అద్భుతంగా వ్రాశారు.

శ్రీమతి దీకొండ చంద్రకళ గారు వ్రాసిన వందరోజుల.వందకవితల సంపుటి చాలా బాగుంది.. ఇందులో వీరు మొత్తం 100 కవితలు వ్రాశారు. విభిన్నమైన అంశాలను కవితా వస్తువులుగా ఎంపిక చేసుకుని వీరి ప్రత్యేకతను నిరూపించుకున్నారు. వంద రోజుల కవితా క్రతువులో పాల్గొని తమ మదిలోని భావాలకు అందమైన అక్షరరూపం ఇచ్చిన వీరిని అభినందించక తప్పదు.. పాఠకులకు అర్థమయ్యే రీతిలో..సరళమైన భాషలో చక్కటి పదాలను ఉపయోగించి వీరు రాసిన ఈ సంపుటి అందరి ఆదరణను పొందాలని కోరుకుంటున్నాను.
శ్రీమతి దీకొండ చంద్రకళగారు ఇటువంటి సంపుటములను మరెన్నో వెలువరించాలని కోరుతూ...

ఈ సంపుటికి ముందుమాట రాసే అవకాశం నాకు లభించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ...
సాహిత్యాభినందనలతో

వరలక్ష్మి యనమండ్ర,
విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయిని,
కవయిత్రి,రచయిత్రి, సమీక్షకురాలు,
అద్దంకి, బాపట్ల జిల్లా.

# కృతజ్ఞతలు

వంద కవితలు వ్రాసే అవకాశాన్ని, తమ ముందుమాటతో ప్రోత్సాహాన్ని అందించిన సమూహ నిర్వాహకులు అడిగొప్పుల సదయ్య గారికి, తమ సమీక్షలతో ప్రోత్సాహ, ఉత్సాహాలను అందించిన శ్రీమతి మహాలక్ష్మి, న్యాయవాది తదితర సమీక్షకులకు, మరీ ముఖ్యంగా.. తన ఆరోగ్యం సహకరించకున్నా, ఇచ్చిన మాటకు కట్టుబడి ఆశీర్వాదంతో కూడిన ముందుమాటను అందించిన సహృదయిని శ్రీమతి వరలక్ష్మి యనమండ్ర గారికి, వృత్తిపరంగా మరియు ప్రవృత్తి పరంగా ఎన్నో కార్యక్రమాలలో తలమునకలైయున్నప్పటికీ, ఇచ్చిన మాట ప్రకారం తమ సమగ్ర సమీక్షను అందించిన శ్రీ పొర్ల వేణుగోపాల్ గారికి మరియు గుర్తులతో తమ అభిప్రాయాన్ని అందించి ఆనందం కలిగించిన సాహితీమిత్రులకు మనసారా కృతజ్ఞతలు.

చంద్రకళ దీకొండ

# రచయిత్రి పరిచయం

| | | |
|---|---|---|
| పేరు | : | చంద్రకళ. దీకొండ |
| విద్యార్హత | : | బి.ఎస్.సి., బి.ఎడ్., ఎం.ఎ |
| వృత్తి | : | స్కూల్ అసిస్టెంట్,<br>సికింద్రాబాద్ ప్రభుత్వోన్నత పాఠశాల |
| అభిరుచులు | : | |

ఆకాశవాణిలో పాటలు, కార్యక్రమాలు వినడం, పుస్తక పఠనం, పలు ప్రక్రియల్లో కవితా రచన, వ్యాస, గేయ రచన...విద్యార్థులచే చిన్న చిన్న నాటికలు వేయించడం, పేరడీ పాటలు నేర్పించడం...

డిగ్రీ చదువుతున్నప్పటినుండీ కవితలు, వ్యాసాలు వ్రాసేదాన్ని. నాలుగేళ్లనుండీ ముఖపుస్తకంలో వివిధ సాహితీ సమూహాలు నిర్వహించే కవితలు, గేయాలు, వ్యాసాలు పోటీలలో విజేతగా నిలిచాను.

సున్నితం, సరళశతకం, తొణుకులు, రాజశ్రీ, సమ్మోహనాలు, శారద చంద్రికలు మొదలైన లఘుకవితా ప్రక్రియలు ద్విశతాధికం రచించాను.

సున్నితం చంద్రికలు అనే నా తొలి లఘుకవితా సంకలనం ఈ ఏడాది మాతృభాషా దినోత్సవం నాడు గవర్నర్ విద్యాసాగర్ వంటి ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరించబడినది.

నవతెలంగాణ, ఏసియా నెట్, న్యూస్, నేటినిజం, సాహితీ గోదావరి,దిక్సూచి, వంటి వివిధ వార, మాస పత్రికలతో పాటు మానవి విహంగ, తరుణి, తపస్వి మనోహరం వంటి అంతర్జాల పత్రికలలో, పలు కవితా సంకలనాలలో నా కవితలు ప్రచురితమైనవి.

- ♣ రెండు జాతీయ స్థాయి పోటీలలో ప్రథమ, ప్రోత్సాహక బహుమతులు,
- ♣ జాతీయ స్థాయి బాలగేయాల పోటీలో ద్వితీయ బహుమతి...
- ♣ వివిధ సమూహాలు నిర్వహించిన కవితా పోటీలలో నగదు బహుమతులు, ఎన్నో ప్రశంసాపత్రాలుమరియు జ్ఞాపికలు అందుకున్నాను.

- ♣ కవిరత్న, కవితావిభూషణ, కలంరత్న, విశిష్ట మహిళా శిరోమణి, సుధీతిలక, రైటర్ ఆఫ్ ద ఇయర్, మహతీ సాహితీ చక్రవర్తిణి, సాహితీ విభూషణ, విజ్ఞాన జ్యోతి, తెలంగాణ బతుకమ్మ జాతీయ స్థాయి పురస్కారం–2021, కణిక ఆత్మీయ పురస్కారం వంటి పలుబిరుదులు, పురస్కారాలు అందుకున్నాను.
- ♣ అంతర్జాల కవిసమ్మేళనాలలో, టోరీ రేడియోలో, యు ట్యూబ్ ఛానెల్స్ లో కవితాగానం చేసాను, చేస్తున్నాను.
- ♣ తానా వారు అమృత్యోత్సవాల సందర్భంగా నిర్వహించిన కవితా లహరి మరియు గాన తరంగాలు పోటీలలో నా రచనలు ఎంపికైనవి. కవిసమ్మేళనంలో పాల్గొని, కవితాగానం చేసాను.
- ♣ గ్రేట్ అట్లాంటా వారు సిరివెన్నెల గారి స్మృతిలో నిర్వహించిన కవితా పోటీలో రెండువేల రూపాయల విలువ గల అమెజాన్ గిఫ్ట్ కార్డ్ ను బహుమతిగా పొందాను.
- ♣ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో మూడు మార్లు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లోనూ నమోదు అయ్యాను.

పుస్తకం అనే అంశంపై అప్పటికప్పుడు వ్రాసిన కవితను చదివి, సి.నా.రె. గారి ప్రశంసకు పాత్రురాలినవ్వడం మరిచిపోలేని మధుర జ్ఞాపకం.

– చంద్రకళ.దీకొండ

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. వేరుమూలం | ~ | 1 |
| 2. మధురాతిమధురమే జీవితం | ~ | 2 |
| 3. విశిష్టమైనది నా దేశం | ~ | 3 |
| 4. ఆమె ఓ నదే | ~ | 4 |
| 5. మనుషుల్లో దేవుడు | ~ | 5 |
| 6. నిరీక్షణ | ~ | 6 |
| 7. అతివ ప్రతిబింబం | ~ | 7 |
| 8. అసంకల్పితమే | ~ | 8 |
| 9. విశ్వదాతలు | ~ | 9 |
| 10. ఇదే లోకం తీరు | ~ | 10 |
| 11. మేలుకలయిక | ~ | 11 |
| 12. ఎదుటివారి ఎదుగుదల నీకాదర్శమైతే | ~ | 12 |
| 13. వట్టిపోతోన్న మట్టి | ~ | 13 |
| 14. తేవాలి పునర్వైభవం | ~ | 14 |
| 15. ఆత్మస్థైర్యమే రక్ష | ~ | 15 |
| 16. మార్పు తిలకం | ~ | 16 |
| 17. చింత–చింతన | ~ | 17 |
| 18. నారికేళం | ~ | 18 |
| 19. నిత్యచైతన్యం | ~ | 19 |
| 20. తప్పనిసరి పోరాటం | ~ | 20 |
| 21. విజ్ఞాన సంజీవనీ తీవ | ~ | 21 |
| 22. మంచితనపు పాదు | ~ | 23 |
| 23. జీవిత పరమార్థం | ~ | 24 |
| 24. అక్షరాల త్రోవ | ~ | 25 |
| 25. వినువీధుల విహారం | ~ | 26 |
| 26. హద్దులుంటేనే ముద్దు | ~ | 27 |
| 27. ఆకాశమే హద్దు | ~ | 28 |

28. ఆరోగ్యదీపాలు ~ 29
29. వయ్యారాల పిల్లతెమ్మెర ~ 30
30. శాస్త్రీయ దృక్పథం ~ 31
31. సౌగంధికా పుష్పం ~ 32
32. వజ్రంలాంటి వ్యక్తిత్వం ~ 34
33. పండుగ పరమార్థం ~ 36
34. వీవెన వంటి భావనలు ~ 37
35. చేజారిన కాలం ~ 38
36. సంసార వృక్షం ~ 39
37. సర్దుబాటు ~ 40
38. సాధ్యము కానిదేది సాధనతో? ~ 41
39. చెలిమి వారధి ~ 42
40. స్వచ్ఛ శుభోదయం ~ 44
41. సార్థకతా సువాసన ~ 45
42. అనుబంధాల తీవెలపై ~ 46
43. జీవనమాధుర్యం ~ 47
44. చెదరని దీక్ష ~ 48
45. సమర్థిని ~ 49
46. దివానక్షత్రాలు ~ 50
47. వ్యక్తిత్వ పరీక్షలు ~ 51
48. నిషా నిశీధులు ~ 52
49. జీవన సమరం ~ 53
50. నీ చుట్టూరా చూడు ~ 54
51. నీ చేతిలో లేనివాటికై చింత మాను ~ 55
52. వచన వింజామరలు ~ 56
53. పాలనా పంచతంత్రం ~ 57
54. కలలా కరిగే కాలం ~ 58
55. రూపవిక్రియ ~ 59
56. ఓటములే నిచ్చెనమెట్లుగా ~ 60

57. రహస్యపేటిక ~ 61
58. నాలుగురోడ్ల కూడలి ~ 62
59. అన్నీ ఒకటే కాదు ~ 64
60. ప్రతిదీ పనికొచ్చేదే ~ 66
61. తెలిసి–తెలిసీ ~ 68
62. మైకాసురులు ~ 69
63. మిథ్యాడంబరం ~ 70
64. ఋతురాగాలు ~ 71
65. మంచికాలపు మహోదయం ~ 72
66. పట్టు విడువని పట్టుదల నీకుంటే ~ 73
67. హృదయ పరావర్తనం ~ 75
68. ప్రగతా?పతనమా? ~ 76
69. పట్టశక్యమా! ~ 77
70. విలువలు చెల్లిన కాలం ~ 78
71. మానవతా మొక్క ~ 79
72. నీకంటూ ప్రత్యేక గుర్తింపు ~ 80
73. శాంతిమంత్రం ~ 81
74. సాంకేతిక రాయబారులు ~ 82
75. శాస్త్రీయశ్వాస ~ 83
76. ఇక రాలేను నీకోసం ~ 84
77. మహోత్కృష్టము మానవజన్మ ~ 85
78. బండబారిన గుండె ~ 86
79. అందరి బంధువు ~ 87
80. ఎవరి కలల ప్రపంచం వారిది ~ 88
81. బంధాల సుగంధం ~ 90
82. జీవన నైపుణ్యాలు ~ 91
83. ఆనందనర్తనం ~ 92
84. మనీప్లాంట్ ~ 93

| | | |
|---|---|---|
| 85. ప్రియరాగాలు | ~ | 94 |
| 86. కనుమరుగైన నెలవు | ~ | 95 |
| 87. కలిసుంటేనే కద ప్రగతి | ~ | 96 |
| 88. పలువింతల ప్రవర్తనలు | ~ | 97 |
| 89. నీలో దీపం వెలిగించు | ~ | 99 |
| 90. ఉత్ప్రేరకం | ~ | 100 |
| 91. తెల్లని మల్లెల మనసులు | ~ | 101 |
| 92. ప్రతి విద్యార్థీ ప్రత్యేకమే | ~ | 102 |
| 93. స్ఫూర్తిదాయకులు | ~ | 104 |
| 94. రైతుమిత్రులు | ~ | 105 |
| 95. మనిషి గుర్తింపుకు ఆధారం | ~ | 106 |
| 96. మానవత్వమా!నీ జాడెక్కడ?! | ~ | 107 |
| 97. తెర దిగియే తీరు | ~ | 108 |
| 98. మానవతకు దర్పణం | ~ | 110 |
| 99. కనులవిందు | ~ | 111 |
| 100. అక్షరసుమాలు | ~ | 112 |

# 1. వేరుమూలం

సంతానాన్ని గర్భంలో మోస్తుంది
కుటుంబ భారాన్ని తలకెత్తుకుంటుంది
కుటుంబానికి వేరుమూలం అమ్మ!

ఆవేదనల ముళ్ల మధ్యనైనా
చిరునవ్వులు చిందించగల
ప్రేమపుష్పం అమ్మ!

అభిశంసనల రాళ్లు విసిరినా
మమకారపు మాధుర్యాన్ని
ఒలికించే మధుర ఫలం అమ్మ!

సమస్యల కఠిన జలాన్ని తాను సేవించి
ప్రియవచన భాష్పోత్సేకంతో
ఓదార్చే ఒడి అమ్మ!

ఎండుకట్టెగా తాను మారినా
మమతానుబంధాల ఊటయి
నిలుచున్న చోట నీడనిచ్చే అమ్మ!

పలకరింపుల నీటి చిలకరింపులకు మురిసి
అనురాగ తీగలు అల్లుకునేందుకు ఆధారమై
సహనం, క్షమ, పరోపకారాల ప్రతిరూపమే అమ్మ !
అమ్మకు అమ్మే సాటి మరి!

తేదీ:7.8.2023

# 2. మధురాతిమధురమే జీవితం

ప్రపంచమంతా అందంగా కనిపింపజేస్తూ
ప్రకృతి అంతా సుందరంగా అనిపిస్తూ
తీయని ఊహల లాహిరిలో
తేలియాడింపజేసే
యవ్వన మధువనిలో విచ్చిన
పూవుల ఊయల వంటి
పదారేళ్ళ వయసు
పూతరేకుల వంటి సొగసు మధురమే!

మంచితనంతో పరిమళిస్తూ
పరుల కొరకై పాటుపడుతూ
అరిషడ్వర్గాలకు అతీతమైన
ఆనందంతో
నిరంతరం చిరునవ్వులు
మోముపై వికసింపజేసే
పసిపాప వంటి మనసు మధురమే!

మనిషిగా పుట్టినందుకు
జన్మ సార్థకమయ్యేలా
ప్రయోజనకరమైన పనులు చేస్తూ
ఇతరులకు హాని తలపెట్టక
మేలు చేకూర్చే ఆశయం కలిగి
చిన్ని చిన్ని సంతోషాలను
స్వంతం చేసుకుంటూ
సంగీత రసాస్వాదనలా
సాగే జీవితం మధురాతిమధురమే!

తేదీ:12.8.2023

# 3. విశిష్టమైనది నా దేశం

వేదాలు ప్రణవ నాదాలై ప్రతిధ్వనించే ఉపఖండం
ప్రకృతి ఆరాధనను, భూతదయను,
ఆరోగ్య సూత్రాలను ఇముడ్చుకొన్న సంస్కృతీసాంప్రదాయాలు
నైతిక విలువలను, వ్యక్తిత్వ మెరుగులను
జీవనపథంలో మిళితం చేసిన
నమస్కార సంస్కారాలు
శారీరక, మానసిక ఆరోగ్యాలను పెంపొందించే
ధ్యాన యోగాలు, సూర్య నమస్కారాలు
ఆనందకర జీవనానికి మూలమైన
పటిష్ఠ వివాహ వ్యవస్థ, కుటుంబ బాంధవ్యాలు నా దేశ ఘనతలు!

1పరమత సహనం, భిన్నత్వంలో ఏకత్వం
పెట్టని కోటలా విరాజిల్లే భరత ఖండం నాది
వేయి సంవత్సరాలుగా ఏ ప్రాంతం మీదా
దాడికి దిగని సహనశీలి
వలస వచ్చిన శరణార్థులను ఆదరించే సంయమనశీలి
విపత్తులు చుట్టుముట్టిన వేళ
పొరుగుదేశాలకు సాయమందించే స్నేహశీలి నా దేశం!

ఆధ్యాత్మికత, శాంతి, సస్యశ్యామలతలకు ప్రతీకగా
నిలిచిన మువ్వన్నెల జెండా..సగర్వంగా తలెత్తుకు నిలబడి
రెపరెపలాడుతూ చాటుతోంది
ఇరవై నాలుగు ఆకుల ధర్మచక్రంలో.. పొదిగిన విశిష్ట గుణాలను!

సారే జహా సే అచ్ఛా నా దేశం
హిమాలయాలంత ఉన్నతం
నా జెండా!

తేదీ:15.8.2023

# 4. ఆమె ఓ నదే

జన్మస్థలం ఎక్కడో అయినా
తాను ప్రవహించిన చోటల్లా
చిరునవ్వుల చిరుసవ్వడితో
పెనవేసుకున్న అనుబంధాలను
మమకారానురాగాలతో
సస్యశ్యామలం చేస్తూ
మెట్టినింటిలో నవ నాగరికతకు
నాంది పలికే ఆమె
ఓ నదే!

అడ్డంకుల రాళ్లవల్ల అయిన గాయాలను
అడ్డువచ్చిన హేళనల కల్మషాలను
సమస్యల సుడిగుండాలను తట్టుకుంటూ
తనలోనే దిగమింగుతూ
తేటనీటి ముఖంతో
నిర్మలమైన చిరునవ్వుతో సాగిపోయే ఆమె
ఓ నదే!

బాధ్యతల బరువుతో
తనదైన అస్థిత్వాన్ని కోల్పోతూ
సంసార  సాగరంలో సంతోషంగా
సంగమించే ఆమె
ఓ నదే!

తేదీ:17.8.2023

# 5. మనుషుల్లో దేవుడు

ఆపదలందు తానున్నానని ధైర్యమిచ్చేవాడు
అన్నార్తులకు, అనాథలకు సాయమందించేవాడు
ఉన్నత వ్యక్తిత్వంతో అలరారేవాడు!

ప్రశాంత చిత్తంలో.. పసిపాప బోసినవ్వులో
పరోపకార ప్రకృతిలో కొలువైనవాడు!

దుష్టశిక్షణ,శిష్ట రక్షణ చేయువాడు
మానవత్వానికి ప్రతిరూపాలైన వైద్యులు,
సేవకులు, సిపాయిలు, అన్నదాతల
హృదయాలలో దాగున్నవాడు
ప్రత్యక్షంగా తల్లిదండ్రులు,గురువుల
రూపంలో దర్శనమిచ్చువాడు!

నీతీ నిజాయితీల ప్రతిరూపం
విశ్వ ప్రేమకు, శాంతికి నెలవైన జ్ఞానదీపం!

సత్యంలో, నిస్వార్ధ సేవలో
దయ, కరుణ, కనికరం నిండిన గుండెల్లో గుడి కట్టుకున్నవాడు!

మూఢభక్తిలో కాక స్వశక్తిలో
ఆడంబరాలలో కాక ఆత్మవిశ్వాసంలో
అందమైన రూపంలో కాక
సుగుణంలో మానవత్వం పరిమళించే మంచిమనసుల్లో
నిరాకారుడై.. నిర్మలుడై.. నీలోనే
మానవ రూపంగానే సాక్షాత్కరించును
మనుషుల్లో దేవుడు!

తేదీ:18.8.2023

# 6. నిరీక్షణ

మోడువారిన మాను
మరల చిగురింపుకు సిద్ధమౌతూ!

బోసిపోయిన తరువు
రాబోవు వసంతానికై ఎదురుచూస్తూ
తన జీవితంలో ఎన్ని సంతోషాల
వర్షాల్లో తడిసిందో
ఎన్ని ఆవేదనల తుఫానులు తట్టుకుందో
ఎన్ని హేళన మాటల వేసవి
వడగాడ్పులను ఎదుర్కుందో?!

ఎన్ని అవమానాల ముళ్ళు
గుచ్చుకుని తల్లడిల్లిందో
నిర్లక్ష్యంగా వీచే నిరాదరణ
చలిగాలికి ఎంతగా వణికిందో?!

అనుభవాలతో రాటుదేలిన వృక్షం
అన్నీ తనను విడిచి వెళ్ళినా
శిశిర వసంతాలు చక్రభ్రమణమేనని ఎరిగి
స్థితప్రజ్ఞతతో స్థిరంగా నిలిచి
వసంతాగమనానికై నిరీక్షిస్తోంది!

తేదీ:19.8.2023

# 7. అతివ ప్రతిబింబం

అగాధాన తీయని
జ్ఞాపకాల ఆణిముత్యాల్ని
అంతులేని బడబాలనాల్ని
దాచుకొన్న మనసులో
భావోద్వేగ కెరటాలెన్నో
బాహ్యప్రదర్శనా తీరాన్ని చేరాలని
ఉవ్వెత్తున ఎగసిపడుతున్నా

తిరిగి విరిగిపడ్డ కెరటాల్లా
తన మనసులోనే దాచుకొంటూ
పైకి మాత్రం ప్రశాంతమైన
చిరుజల్లులు చిందిస్తూ

ఆ జల్లుల్లో తడిసి మురిసే
మనుషుల్ని చూసి తాను సంతోషిస్తూ

తన ఆవేదనల్ని అంతరంగంలోనే దాచుకొని
ఎదుటివారి సంతోషానికై పాటుపడే
అతివ అంతరంగమే
అలల్లో ప్రతిబింబిస్తూ!

తేదీ:22.8.2023

# 8. అసంకల్పితమే

తల ఊపితే సమ్మతం
భుజం తట్టితే ప్రశంస
కంటి చూపే శాసనం
సంజ్ఞలతో సమాచార మార్పిడి!

మానసిక స్థితిని తెలుపు
దేహావయవాల సంకేతాలు
ముఖ కవళికలు, భంగిమలు, స్పర్శ
మానవ సంబంధాలను
పటిష్టపరచు సాధనాలు!

అల్లిన కనుబొమ్మలు
దీర్ఘాలోచనకు ప్రతీకలు!
కంటిరెప్పల అనిమేష దృష్టి
ఆకర్షణకు సూచిక!
శక్తి నిబిడీకృతమైన కేంద్రీకృత
దృష్టితో ఎత్తిన శిరము చాటును ఆత్మవిశ్వాసం!
తల పంకింపులు, చిరునవ్వులు
చూచాయగా తెలుపు మానసిక సంసిద్ధతను!
చేతులు ముఖంపై కప్పుకున్నచో అది సిగ్గుకు సూచన!

కళ్ళ చుట్టూ ముడుతలు లేకున్న అది నకిలీ చిరునవ్వే!
సమర్థవంతమైన బోధనను సానుకూలపరచు
నిర్దిష్ట భావనను గూర్చి
అదనపు సమాచారమిచ్చు
అభ్యాసాన్ని సులభతరం చేయు
దేహభాష అసంకల్పితమే!

తేదీ:23.8.2023

# 9. విశ్వదాతలు

ప్రమాదాలలో గాయపడిన బాధితులను
తీవ్ర అనారోగ్యంతో తల్లడిల్లుతున్న రోగులను
బిడ్డకు జన్మనిచ్చే తరుణంలో తల్లులను
శస్త్రచికిత్సల సమయంలో వ్యాధిగ్రస్తులను
వారి అమూల్యమైన ప్రాణాలను కాపాడే ప్రాణదాత రక్తదాత!

బలవర్ధకమైన ఇనుప ధాతువు
కలిగిన ఆహార పదార్థాలతో
మూడునెలల్లో మళ్లీ కూడగట్టుకునే రక్తాన్ని
రక్తం ధారపోయాలన్నట్లుగా అపోహలు తొలగించుకుంటే
ఆరోగ్యవంతులైన యువత ప్రాణాలు నిలిపే చలివేంద్రాల
వంటి రక్తనిధి కేంద్రాలు ప్రాణావసరాలకు ఆదుకొను!

అవసరం ఐదు కోట్ల యూనిట్లైతే
లభ్యం మూడు కోట్ల యూనిట్లే
స్వచ్ఛంధ సంస్థల సహాయంతో విశ్వదాతల దాతృత్వంతో
"రక్తము నిలువ లేని దేశ"మన్న అపప్రథ తొలగిపోవు!

డబ్బు కోసం రక్తాన్ని
అమ్ముకునే నిరుపేదలున్న దేశం మనది

ప్రాణాన్ని నిలబెట్టిన ఆత్మతృప్తిని పొందాలంటే
చేయాలి మూడునెలలకోమారు రక్తదానం
ప్రాణదాతా సుఖీభవా అంటూ
దీవెనలు పొందేరు నిరంతరం!

తేదీ:24.8.2023

# 10. ఇదే లోకం తీరు

ఎదుటివాడి బాగుపై ఏడ్పులు
వాడు ఆపదలో ఉంటే
ఎగతాళి నవ్వులు!

కుళ్లు కుతంత్రాలు
కక్షలు కార్పణ్యాలు
మాయలు మోసాలు
కపటవేషాలు ద్వేషాలు!

సాయం అందివ్వకపోగా
విసిరేరు మాటల రాళ్లు
పైకి పొగడ్తలు, లోన పొగిలి ఏడ్పులు
నోటితో నవ్వులు
నొసటితో వెక్కిరింతలు!

పారిపోతే వెంటపడే లోకం
తరిమితే పరిగెత్తే లోకం
అదే లోకం తీరు!

నీ విలువలు నీవి, నీ వ్యక్తిత్వం నీది
నీ ముందు జాగ్రత్తలో నీవుండి
నీ వంతు బాధ్యతలు నెరవేర్చి
చుట్టూ ఉన్న చీకటిని తిడుతూ కూర్చోక
చిగురాశ దీపాన్ని వెలిగించు
అందుబాటులో ఉన్న ఆనందకాంతులతో
జీవితాన్ని పండించు!

తేదీ:25.8.2023

# 11. మేలుకలయిక

కాలం చెల్లిన న్యాయ సూత్రాలు
యుగాల క్రిందటి సమాజ నియమాలు
పాతబడిన విద్యావిధానాలు
సంస్కరించబడవలసిందే
కాలానుగుణంగా మారవలసిందే!

చక్రం యొక్క ఆవిష్కరణ
మానవ నాగరికతా పురోభివృద్ధికి తోడై
వ్యవసాయ, రవాణా సౌకర్యాల, కర్మాగారాల,
గృహ సంబంధ సౌకర్యాలకు జోడై నిలిచే!

లలితకళలైనా
భాషా విషయాలైనా
విజ్ఞాన శాస్త్ర పద్ధతులైనా
ఎప్పటికప్పుడు నవ్యరీతులను ఇముడ్చుకోవలసిందే!

పాత అంతా రోత కాదు
కొత్త అంతా వింతా కాదు
పాతకొత్తల మేలుకలయికే
మానవ జాతి పురోగతికి
మేలుబాట ఇక!

తేదీ:26.8.2023

# 12. ఎదుటివారి ఎదుగుదల నీకాదర్శమైతే

ఎదుటివారు బాగుపడుతుంటే అసూయ
ఎదుటివారి పిల్లలు చదువులో
ముందంజ వేస్తే కుళ్ళు
నాకన్నా దర్జాగా వారు
బతుకుతున్నారని ఏడుపు!

పచ్చగా ఉన్న వారి కాపురాన్ని
చూసి కళ్ళల్లో నిప్పులు
ఎప్పుడు వారిపై నిందల రాళ్ళు
విసురుదామాని ఎదురుచూపులు!

కష్టపడలేని బద్ధకస్తుల వెన్నుపోట్లు
మాటలతో పొడిచే కత్తిపోట్లు
ఇతరుల సంపాదనపై ఆశపడే
గుంటనక్కల సాకులివన్నీ!

ఎదుటివారినుంచి మంచి
గుణాలు నేర్చుకో
వారి ఎదుగుదలను చూసి స్పర్ధ పెంచుకో!

చిత్తశుద్ధితో, దృఢ నిశ్చయంతో
ఎదుటివారిపై గెలుపు సాధించి
నిన్ను నీవు నిరూపించుకో!

వారి ఎదుగుదలను ఆదర్శంగా భావిస్తే
ఆనందకరమైన జీవితమే నీదంట!

తేదీ:27.8.2023

# 13. వట్టిపోతోన్న మట్టి

మట్టిలో పుట్టి
మట్టిపై బతికి
మట్టిలో కలిసిపోయే మనిషికి
ఆకాశాన్నంటే ఆశలు
నేలంత విస్తారమైన కోరికలు!

వ్యర్థ రసాయనాలతో వట్టిపోతోంది మట్టి
రేపటి గురించి ముందుచూపు లేక
స్వార్థాన్ని నిలువెల్లా పూసుకొన్న మనిషి
అత్యాశలు ఆకాశాన్నంటి
కురిసే మేఘాలకు అడ్డుగా నిలిచి
ప్రకృతి వైపరీత్యాలకు కారణమై

రైతు ఆరుగాల కష్టాన్ని నీరుగార్చుతూ
నోటివద్ద అన్నాన్ని కాలదన్నుకుంటూ

పచ్చని అరణ్యాల్ని నరికి
వేసవి భుగభుగల్ని తట్టుకోలేక
చిన్ని మొక్కల్ని నాటుతూ
ఆకాశం వంక ఆశగా చూస్తున్నాడు
కురవని వాన చినుకులకోసం!

తేదీ:28.8.2023

# 14. తేవాలి పునర్వైభవం

ఏదీ ఆనాటి తెలుగు భాషా వైభవం?
పొరుగు భాషా రాజులచే
పొగడబడిన ప్రాభవం?!

ప్రతిభకు గండపెండేరాలు
తొడిగించుకొన్న అందలం
ఏనుగు అంబారీపై ఊరేగిన
తెలుగు కవుల ఆడంబరం

అష్టదిగ్గజాల ప్రబంధాలతో
అలరారిన భువన విజయం
అగ్రహారాలు, రత్న కిరీటాలు
బహుమతులుగా పొందిన రాజసం

పరాయి భాష మోజులో పడి
కళావిహీనమైన గతవైభవం
కొనఊపిరితో కొట్టుకులాడుతున్న
దీపంలా నేటి దైన్యం

మనసా వాచా కర్మణా
చేతులడ్డుపెట్టి మనమందరం
భాషాసాహిత్యపు చమురు పోసి
కాపాడాలి సత్వరం
తేవాలి పునర్వైభవం!

తేదీ:29.8.2023

# 15.ఆత్మస్థైర్యమే రక్ష

త్రిశంకు స్వర్గంలో తేలియాడించే
మత్తుమందుల మైకం
నెట్టింట్లో విలయతాండవమాడే
బూతుబొమ్మల తారంగం
మాయమాటలతో బలహీన
మనస్కులను ఛేజింగ్ చేసే చాటింగ్
యువకులను ఆయస్కాంతంలా
ఆకర్షణతో లాగేసే సాంకేతిక
మాధ్యమాల శృంగార సన్నివేశాలు
హద్దులెరుగని విచ్చలవిడితనం
చుట్టూరా కమ్ముకున్న అశ్లీల వాతావరణం!

తెలిసీ తెలియని వయసు ప్రభావమో
ధన వ్యామోహమో నాకు అన్నీ తెలుసు
నేను చేసిందే రైటు అన్న పరువపు ఉరవడో
మాయోపాయాల శ్లేష్మంలో
చిక్కుకునే అబలల ఆక్రందనను
ఒకరికొకరు రక్షగా ఉండాలని
తోబుట్టువులు కట్టుకునే ఈ సన్నని రక్షాసూత్రం
బంధాన్ని బంధించి ఉంచాలని కోరే రక్షాబంధనం
స్వచ్ఛమైన మమకారాలు కనుమరుగౌతూ
స్వార్థపు పల్లకిలో ఊరేగే
మనుషులున్న కలికాలంలో రక్షిస్తుందా?!
ఆత్మరక్షణే శ్రీరామరక్ష ఆత్మస్థైర్యమే కలిపించు స్వీయరక్షణ
వివేచన, విచక్షణలే కాపాడే ఆయుధాలు!

తేదీ:30.8.2023

# 16. మార్పు తిలకం

కాలం చెల్లిన న్యాయ సూత్రాలు
యుగాల క్రిందటి సమాజ నియమాలు
పాతబడిన విద్యావిధానాలు
సంస్కరించబడవలసిందే
కాలానుగుణంగా యుగధర్మానుసారంగా మారవలసిందే!

చక్రం యొక్క ఆవిష్కరణ
మానవ నాగరికతా పురోభివృద్ధికి తోడై
వ్యవసాయ రవాణా సౌకర్యాల కర్మాగారాల
గృహ సంబంధ సౌకర్యాలకు జోడై నిలిచే!

లలితకళలైనా
భాషా విషయాలైనా
విజ్ఞాన శాస్త్ర పద్ధతులైనా
ఎప్పటికప్పుడు నవ్యరీతులను
ఇముడ్చుకోవలసిందే
కాలం చెల్లిన భావాలకు
మార్పుతిలకం తీర్చిదిద్దవలసిందే!

పాత అంతా రోత కాదు
కొత్త అంతా వింతా కాదు
పాతకొత్తల మేలుకలయికే
మానవ జాతి పురోగతికి మేలుబాట
మార్పును స్వాగతిద్దాం సహృదయతతో!

తేదీ:31.8.2023

# 17. చింత–చింతన

మనశ్శాంతి కొరకై ఎక్కడికెక్కడికో
తిరుగుతూ వెతకడం మాని
ఈ క్షణంలోనే జీవిస్తూ
ఇష్టమైన పని చేస్తూ
విమానం గాలికి వ్యతిరేకదిశలో
ఎగిరినట్లు వ్యతిరేక భావోద్వేగాలు,
భావనలనుండి
మనసును మళ్ళించుకుంటూ
అనవసర ఆలోచనలను, ఊహలను తరిమివేస్తూ

మన చేతిలో లేని విషయాలకు
చింతించడం మాని
లేనిపోని భయాలతో
ఆందోళన పడుతూ
తల్లడిల్లకుండా
ఎదురయ్యే సమస్యలకు
ప్రశాంత చిత్తంతో పరిష్కారాన్ని వెదుకుచూ

చంచలమైన మనసును
సాధనతో అదుపు చేసుకుంటే
అద్భుతమైన ఆనందాలెన్నో
అవుతాయి మన స్వంతం!

తేదీ:1.9.2023

# 18. నారికేళం

మదిని కమ్మిన అహాన్ని
తొలగించు చిహ్నంగా
రెండుగా పగులగొట్టిన కొబ్బరికాయ!

రుచికరమైన కొబ్బరిముక్కలు
అరటిపండు, చక్కెరతో కలిపిన బలవర్ధకమౌతూ!

కమ్మగ నోరూరించు
కొబ్బరిముక్కల ప్రసాదం
తక్షణ శక్తినందించు తీర్థం
పోషకాల గని, ఆరోగ్యదాయిని
పంచామృతం!

ఏ పని ప్రారంభానికైనా
ఇంటిలో జరిగే శుభకార్యములనైనా
దేవాలయములో జరిపే పూజలకైనా
కొబ్బరికాయ కొట్టడానికే ప్రాధాన్యం!

అందుబాటులో దొరికే
అద్వితీయ ఆహారం
చౌక ధరలో లభించే
ఖనిజ లవణాల గని
ఆరోగ్యరహస్యాలను
ఇముడ్చుకున్న
హిందూ ధర్మానికి ప్రతీకగా
నిలిచిన నారికేళం!

తేదీ:2.9.2023

# 19. నిత్యచైతన్యం

రవి గాంచనివి
మామూలు కంటికి కనబడని
అంశాలనెన్నిటినో వీక్షింపజేస్తుంది
అక్షర గవాక్షం!

అందమైన దృశ్యాలు కొన్ని
హృదయ విదారకమైన
కారుచీకటి దృశ్యాలు కొన్ని!

ఆనందం కలిగించేవి కొన్ని
ఆహ్లాదాన్ని పంచేవి కొన్ని!

ఊహాలోకాల్లో తేలియాడించేవి కొన్ని
ఆత్మవిశ్వాసం కలిగించేవి కొన్ని!

వెన్నెలలో విహరింపజేసేవి కొన్ని
విప్లవజ్వాలను ఎగదోసేవి కొన్ని!

మనోల్లాసాన్ని కలిగించేవి కొన్ని
మూఢవిశ్వాసాల్ని మట్టుపెట్టేవి కొన్ని!

లోకజ్ఞానాన్ని కలిగిస్తూ
సమకాలీన సమస్యల్ని తేటతెల్లం చేస్తూ
పరిష్కారమార్గాల్ని ప్రకటిస్తూ
నిత్యచైతన్యాన్ని నాలో రగిలిస్తూ!

తేదీ:3.9.2023

# 20. తప్పనిసరి పోరాటం

మనలోనే ఉంటూ
మనతోనే ఉంటూ
కంటికి కనిపించని
కానరాక కబళించే
శత్రువులెన్నో!

మన దేహంపై స్థిరనివాసం
ఏర్పరచుకొని కొన్ని
దేహం లోపల అవయవాల్లో
తిష్ఠ వేసుకుని కొన్ని
కోట్లకొలది శత్రువులతో
పోరాడుతూనే ఉంటాం ప్రతీక్షణం
రోగనిరోధక శక్తి అనే ఆయుధంతో!

మనసులోనూ మాలిన్యం కలిగించే
కనిపించని అరిషడ్వర్గాల శత్రువులు
పోరాడుతూనే ఉంటాం నిరంతరం
ఉన్నత వ్యక్తిత్వం, మానవత్వం
అనే ఆయుధాలతో!

శత్రువుతో ప్రయాణం
తప్పనిసరి అయినప్పుడు
స్వీయరక్షణ, ఆత్మవిశ్వాసం,
ఆశావాద ఆయుధాలు
కూడగట్టుకోవలసిందే
పోరాడవలసిందే!

తేదీ:4.9.2023

# 21. విజ్ఞాన సంజీవనీ తీవ

అక్షరాభ్యాసం చేయించి వెన్నతోపాటు
విలువల విద్యను ముద్దలా చేసి
అందించే అమ్మే ఆదిగురువు
వేలుపట్టి నడిపించి లోకజ్ఞానం
నేర్పించే నాన్నే మలిగురువు
అందనంత ఎత్తుకు నీవెదిగినా
అ ఆలు నేర్పిన పంతులే
నీ చక్కని జీవితానికి పునాది!

ఉద్గ్రంథంలో ఉన్న జ్ఞానాన్ని
సోదాహరణలతో వివరించి
సులభరీతిలో విశదపరిచేవాడు
దిక్కుతోచని సమస్యలో నీవుంటే
దివ్యమైన సలహాలనిచ్చేవాడు
అజ్ఞాన తిమిరాన్ని తొలగించి
విజ్ఞాన దీపాలు వెలిగించేవాడు!

కులమత,ధనికపేద
తారతమ్యాలెరుగక విద్యను
బోధించువాడు
జీవితాన్ని అర్థవంతంగా మలచుకునే
కళను నేర్పించువాడు
జ్ఞానం అనే వెలుగును
ప్రసాదించు నిరంతర విద్యార్థి!

విద్యార్థి మనసులోని
మలినాలను తొలగించే చిల్లగింజ

ఎగిరే గాలిపటం వంటి
జీవితానికి దారం వంటి ఆధారం!

చదుర్విధోపాయములతో
చెడు నుంచి మంచికి
మళ్లించువాడు
ముడిబంగారం వంటి విద్యార్థి మేధను
జ్ఞానాభరణంగా మలిచే స్వర్ణకారుడు
అజ్ఞాన హతులను
విజ్ఞానమయం జేయు సంజీవనీ తీవ
విరజానదిని దాటించే
మనోజవమైన నావ
యాచార్య సేవ!

కనుబొమ్మల కదలికలతో
విద్యార్థి తప్పులను
సరిదిద్దువాడు
నాగరికత,క్రమశిక్షణ,
సంస్కార,దేశభక్తి,
మానవత్వ విలువలను
పెంపొందించువాడు!

నల్లబల్లపై తెల్లని అక్షరాలతో
విద్యార్థి భవిష్యత్తును
రంగులమయం చేసేవాడు
పదికాలాల పాటు నిలిచి
నీడనిచ్చే తరువు గురువు!

తేదీ:5.9.2023

# 22. మంచితనపు పాదు

రూపం లేనిది రేపు అయినా
రేపు మీద ఆశే మనిషిని బ్రతికించేది
రేపటి ఉదయపు చింతే
మనిషిని చైతన్యంతో ఉంచేది!

దాహమేసిన నాడే బావి తవ్వితే ఎలా?
రేపటి భావికి ఈనాడే
పునాది వేయాలి!

పుట్టుకనుండే పుల్లా పుడకా కూడబెట్టి
రేపటి భద్రతా గూడును కట్టాలి!

బాల్యం నుంచే మంచి
విద్యాబుద్ధులు నేర్పాలి
భావిభారత పౌరుల
నడవడికను తీర్చిదిద్దాలి!

రేపటి తరానికై జీవ వనరులను
ఆదా చేయాలి
కలుషితం కానీక
స్వచ్ఛంగా అందించాలి!

మంచితనపు పాదు వేసి
సమతజలం పోయాలి
మానవతా సుమాలను
వికసింపజేయాలి!

తేదీ:6.9.2023

# 23. జీవిత పరమార్థం

నిరంతరం చిరునవ్వులు
చిందించు రూపమే రూపం
మదికి సాంత్వననందించు.. వాక్కే వాక్కు
విన్నంతనే హాయిగొలుపు.. గాత్రమే గాత్రం
అందరికీ ఆదర్శంగా నిలుచు
వ్యక్తిత్వమే వ్యక్తిత్వం!

అంతరాలు అసలు చూడని.. స్నేహమే స్నేహం
అవసరాలలో ఆదుకొను
బంధుత్వమే బంధుత్వం
కలకాలం వీడక పెనవేయు.. బంధమే బంధం!

అన్యుల బాధలకు తల్లడిల్లు.. హృదయమే హృదయం
అపాత్రదానం కాని
దానమే దానం
అరిషడ్వర్గాలకు లొంగని
మనసే మనసు
సంతృప్తితో సాగించు.. జీవనమే జీవనం!

సుకార్యములకుపయోగపడు
సంపదయే సంపద

సంతోషాన్ని పంచు
మానవుడే మానవుడు
పరులకుపయోగపడు.. దేహమే దేహం
పరమార్థాన్ని సాధించు జీవితమే జీవితం!

తేదీ:7.9.2023

# 24. అక్షరాల త్రోవ

బడిలో బలపం చేతబట్టి
దిద్దిన అక్షరం
భావి జీవితానికి
బంగరు బాట వేస్తుంది!

నడతకు నడక నేర్పుతుంది
నడవడికకు మెరుగులు దిద్దుతుంది!

అస్తిత్వానికి వన్నె తెస్తుంది
సమాజంలో ఉన్నత స్థానాన్ని అలంకరింపజేస్తుంది!

లోకజ్ఞానాన్ని కలిగిస్తుంది
నలుగురిలో గౌరవాన్ని నిలుపుతుంది!

విజ్ఞాన శాస్త్ర విషయాల్ని విశదీకరిస్తుంది
మూఢనమ్మకాల అజ్ఞానాన్ని మూసివేస్తుంది!

అంతరంగంలోని భావాలకు రూపమిస్తుంది
సాహిత్య లోకానికి పరిచయం చేస్తుంది!

అక్షరజ్ఞానం లేని
అమాయకులు,అనామకులు
అక్షరాల త్రోవలో పయనం
సాగిస్తే అవుతారు  అజేయులు!

తేదీ:8.9.2023

# 25. వినువీధుల విహారం

నీలాల కనుపాపల కదలికలో
కదలాడే స్వప్న మధురిమలెన్నో!

ఆంక్షల సంకెళ్లు లేవు
అదుపు, అజమాయిషీలు లేవు
హద్దులన్నవి లేనేలేవు!

కోరికల శారికలెగురువేస్తాను
అంతరంగ భావ సంద్రంలో
మధురానుభూతుల ఆణిముత్యాలేరుకుంటాను
ఆశల ఊయలలూగుతాను
పరవశాల పల్లకీలో ఊరేగుతాను!

నీటిలో చేపనౌతాను
నింగిలో పక్షినౌతాను
రెక్కలు కట్టుకుని దిక్కులన్నీ చుట్టివస్తాను
అద్భుత దృశ్యాలు వీక్షిస్తాను
ఎత్తైన శిఖరాలు అధిరోహిస్తాను
అసాధ్యాలన్నీ సాధిస్తాను!

స్వప్న వీథిలో సంచరిస్తూనే ఉంటాను
కన్నులు తెరిచేదాకా.. కమ్మని కల కరిగేదాకా
వాస్తవం కనుల ముందు నిలిచేదాకా!

కలైతేనేం.. మాయాప్రపంచమైతేనేం
మాయమయ్యేదాకా నాతోనే ఉంటుందిగా
అసాధ్యాలన్నీ సుసాధ్యం చేసేస్తుందిగా!

తేదీ:9.9.2023

# 26. హద్దులుంటేనే ముద్దు

తాడు లేని బొంగరంలా
దారం తెగిన గాలిపటంలా
నింగిలో ఎగిరితే స్వేచ్ఛానందమే
నిర్లక్ష్యపు పయనంతో
అస్తిత్వం అనుమానాస్పదమే!

బాధ్యతలేని హక్కులతో
బలాదూర్ తిరిగితే
భవిష్యత్తు అంధకారమే!

పొంచి ఉన్న అనూహ్య
పరిణామాల యోచన లేక
గాలి ఎటు వీస్తే అటు
క్రమరహితాచలనంతో సాగే
నిర్లక్ష్య జీవన పయనం
కడగండ్ల కారకమే!

రహదారి అంతా నాదే
అన్నట్టుగా స్వేచ్ఛగా
బండి నడిపితే
ప్రమాదంగా మారును ప్రమోదమే!

హద్దులున్న స్వేచ్ఛే
ఎవరికైనా,ఎప్పటికైనా ముద్దు
పరిధి దాటిన స్వేచ్ఛ
విశృంఖలమౌతుంది–వద్దు!

తేదీ:10.9.2023

# 27. ఆకాశమే హద్దు

నీలినింగికి  వివిధ
వర్ణాలనద్దుతూ
వన్నెచిన్నెల గాలిపటం!

పొడవైన దారం ఆధారంగా
పైపైకి వెళ్లి ఊగిసలాడే
రేఖీయ గాలిపటం!

ఇళ్లను , చెట్లను దాటి
పక్షులకు పోటీగా పయనిస్తూ
ఆకాశమే హద్దుగా
ఎగిరే పతంగం!

మెల్లమెల్లగా పైకెగురుతూ
మబ్బుల్లో దాగి మాయమౌతూ,
ప్రత్యక్షమౌతూ
చిన్నారుల కళ్లల్లో
వెలుగుల్ని పూయిస్తూ
ఒడుపుగా పొడవైన
దారాన్ని పట్టుకుని
నైపుణ్యంతో ఎగురవేస్తే
పైపైకి ఎగురుతూ అజాగ్రత్తగా ఉంటే
చెట్లకొమ్మల్లో  చిక్కుకుంటూ
వ్యాయామంతో పాటు
పిల్లల పెద్దల నడుమ చెలిమిని పెంచి
జీవిత సత్యాన్ని బోధించే పతంగం!

తేదీ:11.9.2023

# 28.ఆరోగ్య దీపాలు

కరుణ కలిగిన దృక్కుల చల్లని చిరునవ్వుతో
ధైర్యాన్నందించే వాక్కుతో
రోగుల ఆందోళన, భయాలను తొలగించి
సగం జబ్బును మాయం చేసి
ముఖంపై చిరునవ్వును తిరిగి
తెప్పించే అపర ధన్వంతరులు!

అంతులేని సహనమే ఆభరణంగా
దయా ఔదార్యాలే ఆభూషణలుగా
జుగుప్స కలిగించే శరీరాలనైనా
దుర్వాసన కలిగించే గాయాలనైనా
చీదరించుకోకుండా అసహ్యపడకుండా చికిత్స చేస్తూ!

ఎవరికొరకైతే తాము పాటుబడుతున్నారో
ఎవరికైతే తాము చికిత్సనందిస్తున్నారో
ఆ ప్రజలే తమపై దండెత్తినా
తమ కర్తవ్యాన్ని వీడని నిస్వార్థ కరుణామయులు!

ప్రాణాంతక వ్యాధులు చుట్టుముట్టువేళ
మహమ్మారుల దాడిని తిప్పికొడుతూ
వృత్తి నిబద్ధతతో వేళ కాని వేళలనైనా
విసుగూ విరామం లేకుండా
పోయే ప్రాణాలకు ఊపిరులూది

అనారోగ్య తిమిరాన్ని
తరిమివేయు ఆరోగ్య దీపాలు
ఇలపై నడయాడే దేవతలు వైద్యులు!

తేదీ:12.9.2023

# 29. వయ్యారాల పిల్లతెమ్మెర

పొగడ పొన్నలపై వాలి
మల్లెలు, మొల్లలు, మంచి
విరజాజుల సౌరభాలపై తేలి
మరువం దవనాలపై కూసింత సోలి!

మందార పుప్పొడిని పూసుకుని
చంపక గంధం అలదుకుని!

దేవగన్నేరు కాంచనాలను పలకరించి
అడవిపూల అందాలను ఆస్వాదించి!

మొగలి సంపెంగ పొదల్లో దూరి
పారిజాత వృక్ష ఛాయల్లో సేదదీరి!

గులాబీల ఘుమఘుమలను
గుట్టుగా దాచుకుని
మాలతీలతను గాఢంగా
కాసేపు పొదవుకుని!

పూదోటలో హాయిగా తిరుగాడుతూ
పులకరించిపోతూ
పరవశంతో తూలుతూ
వయ్యారాలు పోతూ
మోసుకొస్తోంది పిల్లతెమ్మెర
పరిమళ సోయగాన్ని!

తేదీ:13.9.2023

# 30.శాస్త్రీయ దృక్పథం

చంద్రునిపై, అంగారకునిపై
కాలు మోపినా
సుదూర విశ్వాంతరాళాలకు పయనించినా
మూఢ విశ్వాసాలు మాత్రం మనసు
పాతాళంలో పదిలం!

శాస్త్రీయ దృక్పథం లోపించిన కారణంగా
మనసులో పాదుకునే మూఢనమ్మకాలు
అజ్ఞానం, నిరక్షరాస్యతలే బలమైన కారణాలు!

మనిషి సంకల్పం బలమైనదైతే
పారిపోవును దోషాలు
చెడు దృష్టులు, నవగ్రహ ప్రభావాలు
విశ్వశక్తులు ఏకమై తీర్చును
నీ సమస్యలు
వదిలిపోవును ప్రాణాంతక వ్యాధులు!

నీలో గూడు కట్టుకున్న
భయమే దయ్యం
వదిలించే ధైర్యమే
తోడుగా నిలిచే దైవం!

తేదీ:14.9.2023

# 31. సౌగంధికా పుష్పం

కనులు మూస్తే కలలు
అందమైన దృశ్యాల వలలు
చూడని నవలోకాల్లో విహరింపజేస్తూ
మునుపెరుగని దారుల్లో సంచరింపజేస్తూ!

సంద్రంలో ఎగసే అలలు
మనసులో తీరని కలలు
ఎంత ఎత్తుకు ఎగసినా
ఆకాశం అందేనా?!
ఆనందంగా ఎగసి
ఆవిరయ్యే ఆశలు కొన్ని
అలల్లా పైకెగసి విరిగిపడే
అడియాశలు కొన్ని!

మెలకువ కలిగితే రాలిపోయే
స్వప్నకుసుమాలను
తనివితీరా ఆఘ్రాణిస్తూ
ఊహల పల్లకీలో ఊరేగుతూ
భవసాగర బాధలను మరుస్తూ
తెలియని ఆనందాల
లోకాల్లో విహరిస్తూ
సేదదీరే సగటు జీవులు!

ఆశల ఆకర్షణ పత్రాలతో ఊరించే
కలల కుసుమాలు అందుకోవాలంటే
ఓర్చుకోవాల్సిందే ఆటంకాల
కంటకాల బాధ!

నిరంతర కృషి, పట్టుదల,
దీక్షలు నీ స్వంతమైతే
అందుకోగలవు
గంధమాధన పర్వతాల్లో
గుబాళించే సౌగంధికా
పుష్పాన్నైనా
గగనకుసుమాన్నైనా అవలీలగా!

చేరుకోగలవు కలల తీరం
సునాయాసంగా!

తేదీ:15.9.2023

# 32. వజ్రం లాంటి వ్యక్తిత్వం

సుగుణాలెన్నో రాశి పోసి ఉన్నా
ఒక్క చెడ్డగుణం తెల్ల కాగితంపై
నల్ల మరకలా నిలిచిపోతుంది
రావణ బ్రహ్మ వీరత్వం, తపోశక్తి,పట్టుదల
సీతాపహరణంతో తుడిచిపెట్టుకుపోయినట్లు!

వ్యక్తిత్వ నిర్మాణంలో తల్లిదండ్రులు కుటుంబము,గురువులు,
పరిసరాలదే ప్రధాన పాత్ర అయినా
కొన్ని వ్యక్తిత్వాలు
పంకజాల్లా వికసిస్తాయి
కొన్ని వ్యక్తిత్వాలు పండితపుత్రుని సామెతలౌతాయి!

సజ్జన సాంగత్యంతో, విద్యాజ్ఞానంతో
రూపుదిద్దుకునే వ్యకిత్వం
నీకొక ప్రత్యేకతను సంతరింపజేస్తుంది!

శిక్షణ, క్రమశిక్షణ
పరిస్థితికి ప్రతిస్పందన
భావోద్వేగ నియంత్రణలలో
పరిపూర్ణ వ్యక్తిత్వంతో యువతకు
ఆచారణా వెలుగులు వెదజల్లింది
వివేకానందుని విశిష్ట వ్యక్తిత్వం
వినయంతో కూడిన విద్య
ఉన్నత వ్యక్తిత్వానికి సోపానం!

అష్టకష్టాలు పడినా అసత్యాన్ని
పలకని హరిశ్చంద్రునికిలా

సత్యం ఇంటిపేరై వెలుస్తుంది
పదుగురికి ఆదర్శంగా నిలుస్తుంది!

నిలుపుకున్న వ్యకిత్వాన్ని
ధన వ్యామోహానికో
విలాసాల కోసమో అమ్ముకుంటే
తాత్కాలిక ఆనందాన్నిచ్చినా
అపరాధ భావం
నిలువెల్లా దహిస్తుంది!

బలమైన వ్యక్తిత్వం బలహీనతల్ని జయిస్తుంది
అరిషడ్వర్గాలకు లొంగని ఉన్నత వ్యక్తిత్వం
వజ్రంలా ప్రకాశిస్తుంది
శ్రీరాముని వ్యక్తిత్వంలా తరతరాలు
చెప్పుకునే చరితవుతుంది!

తేదీ:16.9.2023

# 33. పండుగ పరమార్థము

పత్ర, ఫల, పుష్ప, తోయములకే
సంతసించి వరములిచ్చు
బొజ్జ గణపయ్య మట్టి విగ్రహమును
పూజించిన చాలును
బలవంతపు చందాల నీలాపనిందలేల?!
రసాయనాలతో రూపొందించిన భారీ విగ్రహాలేల?!

జాతీయ సమైక్యతను చాటుటకు సాధనమైన
పర్వదినమునకు ఆడంబరాలు, హంగులతో పని ఏల?!

ఏ ఆకారమునైననూ ఒదిగి
విఘ్నములను తొలగించి.. విద్యా బుద్ధి, జ్ఞాన సిద్ధు ల
ప్రసాదించే వినాయకునకు
విద్యుద్దీప తోరణాల తళుకులేల?!
వినికిడికి చేటు కలిగించే వాయిద్యఘోష ఏల?!

పుడమి కాలుష్యమున హరించుటకు
హరితహారమే ఔషధమని చాటుతూ
వినాయక చవితి నాడు చేయు
ఔషధయుక్తమైన ఇరవైయ్యొక్క రకముల పత్రిపూజ తెలుపునది
తరువుల రక్షణ ప్రాముఖ్యతనే!

విగ్రహ నిమజ్జనము చేయునది
నదులు, చెరువుల పరిరక్షణ కొరకే!
పండుగలోని పరమార్థము తెలుసుకుందాము
ఆచరించి భూగోళమును కాపాడుకొందాము!

తేదీ;17.9.2023

# 34. వీవెన వంటి భావనలు

హృదయపు లోతుల్లోంచి
భావోద్వేగాలు పెల్లుబికేలా
అంతరంగపు సంద్రాన
ఆలోచనల అలలు, ఆవేదనా తరంగాలు అల్లల్లాడగా
ఆశనిరాశల జీవన పోరాటంలో జతగూడిన
కళ్ళు చెమర్చే జీవనసత్యాలు పొందుపరచుకొని!

నవ్వితే ఏడుస్తూ.. ఏడిస్తే నవ్వుతూ
అవహేళనలతో
ఆత్మన్యూనతను కలుగజేస్తూ
ఎదుగుదలను సహించక
విమర్శల రాళ్లు రువ్వే
కఠిన ప్రపంచపు కరకు
అనుభవాలకు లేపనమై!

కోయిల పాట కమ్మదనాల భావాలతో
విరిసిన పూవుల
పరిమళ పదాలతో
మాలయమారుత వీవెన
వంటి భావనలతో
వసంతం పలికినట్లుండాలి కవిత్వం!

సామాజిక సమస్యలపై ధ్వజమెత్తుతూ
మానవతా పుష్పాలను పూయిస్తూ
నూతనోత్సాహాన్ని, స్ఫూర్తిని,
చైతన్యాన్ని రగిలించే సాహితీ కన్యకు నీరాజనం!

తేదీ:18.9.2023

# 35. చేజారిన కాలం

తాకిన తొలిచూపుల
మిక్చర్ పొట్లం విప్పి
తరచి చూసాను
ఆకర్షణో వ్యామోహమో
నిజమైన ప్రేమో
తేల్చుకోలేక!

ఆశల పూవులను ఏరి
అందమైన అనుభూతులను కలబోసి
సుందరంగా తీర్చిదిద్దిన ప్రేమలేఖ!

చేరవలసిన చిత్తపు చిరునామాకు
చేరని తప్పిపోయిన ఉత్తరం!

దొరికింది చివరకు
ఎదురుచూపులతో
కాలం దొర్లాక!

గతం తలచిన తలపుల ఉరవడిలో
అరవై వయసు ఇరవై మనసు!

తలచినది నెరవేరక
కళ్లలో కనపడిన పెళ్లిపందిరి
కల కల్లయై
నిరాశా శీతలం దరిచేరిన వేళ
వెచ్చని గొంగళి వంటి నీ కౌగిలిలో
ఊహల ఊయలూగుతూ నేను!

తేదీ:19.9.2023

# 36. సంసార వృక్షం

ప్రేమాభిమానాల తల్లివేరు
ఆప్యాయతానురాగాల
పిల్లవేళ్ళ మూలాలతో
వేళ్లూనుకొన్న పుట్టింటి
గారాల పచ్చని మొక్క!

పెరిగి...అల్లరి చేష్టల మొలకై
కళకళలాడే బంధాల
కొమ్మల రెమ్మలు వేసి
మమతానుబంధాల
పుష్పాలు పూసి పెద్దదై
వాత్సల్యపు నేలమట్టిని వీడి!

మెట్టినింటి కొత్త వాతావరణానికి
అనుకూలంగా తాను మారి
అలవాట్లు మార్చుకొని
గాలి మార్పులు తట్టుకొని!

మెల్లమెల్లగా అక్కడి నేలలో నాటుకొని
సత్సంబంధాల మారాకులేసి
తిరిగి కళకళలాడే బంధాల
కొమ్మల రెమ్మలు వేసి
మమతానుబంధాల
సంతాన పుష్పాలు పూసి
పచ్చని సంసార వృక్షమై వర్ధిల్లుతుంది
ఇంటి దీపమై వెలుగులు వెదజల్లుతుంది!

తేదీ:20.9.2023

# 37. సర్దుబాటు

కులమత బేధాలు
పెద్దల వాదాలు
పీటల మీద ఆగిపోయే పెళ్లిళ్లు!

చిలికి చిలికి
గాలివానలయ్యే గిల్లికజ్జాలు
చివ్వున తలెత్తే ఈగోలు!

తప్పని బరువుబాధ్యతలు
తప్పించుకోలేని కుటుంబ పరిస్థితులు
తప్పక చేయాల్సిన త్యాగాలు!

మనసొకచోట
మనువొకచోటై
మధనపడే ఇరు హృదయాలు!

తప్పనిసరై అంతరంగపు అట్టడుగుకు
నెట్టివేయబడే మూగప్రేమలు
సర్దుకుపోవాల్సిన కాపురాలు!

మూలకారణాలేవైనా
సర్దుబాటుతో అందమైన
అనుబంధాలుగా మలచుకునే
వివాహ బంధాలు!

తేదీ:21.9.2023

# 38. సాధ్యముకానిదేది సాధనతో?

సాధ్యముకానిదేది ఇలలో ఎడతెగని సాధన చేసిన
సాధనమున పనులు సమకూరును ధరలోన!

కలలు కంటే సరిపోదు గెలిచి తీరాలంటే జీవితబరిలో
సతతము చేయవలె సాధన పస నీది చూపవలె రయమున!

పడి లేస్తూ నేర్చుకునును పసివారు నడక సాధనతో
దెబ్బలు గాయములతోనే నేర్చుదురు జనులు
వాహనచోదన సాధనతో పడిలేచే అల నేర్చును
అలుపెరుగని ప్రయత్న సాధన!

విరి వలె పరిమళించాలి వ్యక్తిత్వం
ఝరిలా సాగాలి
లక్ష్యసాధనకై జీవనప్రవాహం!

మరి మరి ఆలోచనలతో గడపక
సరి సరి నడకలు నడవాలి!
సరిలేరు నీకెవ్వరూ
అనిపించుకోవాలి సాధనతో!

తినగ తినగ వేము తీయనుండు
అలవాటైతే విషమునైన హాయిగ త్రాగవచ్చు!

సాధనతో సాధ్యము అసాధ్యములు
సాధించవచ్చు అనితర సాధ్యములను!

తేదీ:22.9.2023

# 39. చెలిమి వారధి

మొదటి అడుగు ఎప్పుడూ ఒంటరే
బాట వెంట ఎవరైనా తోడుంటే
దూరమెంతైనా సునాయాసపు నడకే!

పయనంలో ప్రమాదాలెదురైనా
అనుకోని ఆటంకాలు అడ్డుకున్నా
అడుగడుగుకూ స్నేహపు గొడుగును
పడుతుంటే
ఒకరికొకరు సహాయంగా ఉంటే!

దూరమెంతైనా భారం కాదు
లక్ష్య సాధన దూరం కాదు
గమ్యం చేరుట అసాధ్యం కాదు
జీవన గమనంలో ఉత్సాహాన్ని
నింపే నేస్తాలు తోడుంటే!

చెలిమితో చేతులు కలుపుతూ
ఒకరికొకరు చేయూతల
వారధి నిర్మిస్తే
దూరపు కొండలు చేరువగు
ఉన్నత శిఖరమైనా తలవంచు!

పని పంచుకుంటే కార్యం
అవుతుంది సులువు
అందరూ కలిసి నడిస్తే
మార్గాయాసం తరుగు
లక్ష్య సాధన సులభం అగు!

అందరి కోసం ఒక్కడు నిలిచి
ఒక్కని కోసం అందరు కలిసి
సహకారమే వైఖరి కాగా
ఉపకారమే ఊపిరిగా
సాగినప్పుడే సొంతమౌను
మంచి జీవితం
శ్రీ శ్రీ నుడివినట్టుగా!

వల్లించే ఆదర్శాలను
ఆచరణలో చూపి
ఆదర్శంగా నీవు నిలిచి
పరుల హృదయాలలో నిలవాలి
జీవిత లక్ష్యం గెలవాలి!

తేదీ: 23.9.2023

# 40. స్వచ్ఛ శుభోదయం

సుప్రభాత సుస్వర రాగాలతో శుభోదయం
సుందరమైన ప్రకృతి కాంత దర్శనం!

సుమనోహర సోయగాల సౌగంధికా సుమ సౌరభాలు
ఆకాశవాణిలో సుధారసం చిలికించే సుభాషితాలు
ఆకాశాన విహరించే కొంగల బారుల విన్యాసాలు
సురుచిర సుమధుర
కలకూజితాల విహంగ సముదాయం!

సుదూరంగా వినిపించే సెలయేటి గలగలలు
గాలిలో తేలివచ్చే సలలిత రాగాల సుషిర నాదాలు
మనసును పరవశింపజేసే సువాసనాల సాంబ్రాణి ధూపాలు
మనసులో సాత్విక భావాల సుమహారాలు
సాంత్వననిచ్చే ప్రకృతి అందాలు!

పత్రాలపై ముత్యాల సరాల్లా
మెరుస్తూ సలిల వర్షపు చినుకులు
పలుకును తొలిపొద్దుకు స్వాగతం!

సిందూర వర్ణంలో మెరిసే
సూర్యబింబపు సాక్షాత్కారం

ఆరోగ్య సిరులనందించే సుషమ రూపం
జీవులకు నిత్యనూతన స్పందన దీపం
నూతనానుభవాలకు ఉద్దీపనం!
కాలుష్యరహిత స్వచ్ఛ శుభోదయం ఇలలో స్వర్గం!

తేదీ: 24.9.2023

# 41. సార్థకతా సువాసన

నిధి చాల సుఖమా రాముని సన్నిధి చాల సుఖమా
అనిన త్యాగరాజ కీర్తనను

నిండార రాజు నిద్రించు నిద్రయునొకటే
అండనే బంటు నిద్ర అదియు నొకటే
అందరికీ శ్రీహరే అంతరాత్మ అని చాటిన
అన్నమాచార్యుని సంకీర్తనను  జ్ఞప్తియందుంచుకొని!

కొనగోటి మీద జీవితమే అయినా
నఖచిత్రమై తళుకులీనాలి
బతకడం కాక జీవించాలి!

ఉన్న నాలుగునాళ్లూ  రాగ ద్వేషాలతో కుమిలిపోక
ప్రేమానురాగాలతో పరిమళించాలి!

ప్రకృతి నేర్పే పాఠాలను ఆకళింపు చేసుకొని
జీవితానికో సార్థకతా సువాసననద్దాలి!

కోమల హృదయ వీణియను శృతిచేసి
చిన్ని చిన్ని ఆనందాల మెట్లపై
చిరునవ్వుల కొనగోట మీటుతూ
అందమైన అనుభూతుల రాగాలు పలికించాలి!

ప్రతి ఉదయమూ క్రొంగొత్త ఉత్సాహంతో  జీవిత
సంగీతసాధన చేయాలి
ఈతిబాధల అపశ్రుతులను సరిచేస్తూ
ఆదర్శవంతమైన పరోపకారార్థ
ప్రియరాగాలు ఆలపించాలి!

తేదీ:25.9.2023

# 42. అనుబంధాల తీవెలపై

చంద్రుని వెన్నెలలో
కలువ జలకాలాటలు
సూర్య కిరణాలు సోకగనే
సరోజం నవ్వుల కిలకిలలు!

దూరాభారం ఎంత ఉన్నా
కలువకు, చంద్రునికి
కమలానికి, సూర్యునికి
నడుమ అవినాభావ సంబంధం!

కయ్యాన్ని రూపుమాపి
నెయ్యాన్ని పెంచి
దూరాలను దూరం చేసే
అనురాగ తరంగం!

అనుబంధాల తీవెలపై
మీటిన ప్రేమరాగం
ఆస్వాదించగ మధురం మధురం!

అనుబంధాల తీవెలపై
అల్లుకున్న ప్రేమవృక్షం
తరతరాలకు తరగని అమూల్య వరం!
ఆ ఛాయన గడిపే జీవితమే ఆనందమయం!

ఎడబాటులో ద్విగుణీకృతమయ్యేను
అనుబంధం
వేచిన కనులలో వెలుగును
సంతోష కాంతిపుంజం!

తేదీ:26.9.2023

# 43. జీవన మాధుర్యం

తల్లి లాలిపాటలోన
పిల్ల బోసినవ్వులోన
కలదెంతో మాధుర్యం!

అచ్చతెలుగు  పదములోన
జానపదుల పాటలోన
కలదెంతో మాధుర్యం!

మంచిమనసు మాటలోన
కమ్మనైన కవితలోన
దాగున్నది మాధుర్యం!

మిత్రుని చెలిమిలోన
మెచ్చిన చెలి చెంతన
కలదు కదా మాధుర్యం!

భౌతిక సుఖములలోన
ఐహిక విలాసములలోన
పొందునది తాత్కాలిక మాధుర్యం!

నచ్చిన పనితో
మెచ్చిన మనిషితో
మనుగడయే అతి మధురం!

సంతృప్త హృదయముతోన
స్వచ్ఛమైన మదితోన
ప్రశాంత ప్రకృతిలోన
ఆస్వాదించుము జీవనమాధుర్యం!

తేదీ:27.9.2023

# 44. చెదరని దీక్ష

ఘల్లుఘల్లున కాలి గజ్జెలందెలు మ్రోగ
కలహంస నడకల కులికే కలికి సౌందర్యాలు!

ఆహా ఏమి శిల్ప కళానైపుణ్యం!
తన లలిత కళా ప్రతిభతో
ఉలితో శిలకు జీవం పోయును శిల్పి!

భరతుడు వర్ణించిన
నాట్య భంగిమలు
నాట్యకత్తె సొగసు
సోయగములు
చెక్కిరి శిల్పులు చెదరని దీక్షతో!

దేవాలయ కుడ్యములపై
శిల్పుల కళా చాతుర్యంతో
కొలువుదీరిరి సౌందర్య రమణులు
రామప్ప గుడి వాకిట వెలసిన రాగిణులు
మెలికల భంగిమలతో నాట్యం చేసే నాగినులు!

కేశములు, నఖములు,
హస్తరేఖలు, మేని మడతలు వంటి
అతి సూక్ష్మ అంశములను సైతం
సజీవ శిల్పాలేమోయని
భ్రాంతి గొలిపేలా అద్భుతంగా చెక్కిరి
శతాబ్దములైనా చెక్కుచెదరని
భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల
చరితను కనుల ముందు నిలిపిరి!

తేదీ:28.9.2023

# 45. సమర్ధిని

అందాల మందారం
అమ్మానాన్నల బంగారం
ఆత్మీయతకు చిరునామా
ఆనందపు దివిటీ!

ఆంక్షలతో అణగదొక్కనీయక
ఆదరణనందిస్తే
ఆకాశమే హద్దుగా ఎదిగి
కన్న కలలు నెరవేర్చే కనకం!

అమ్మతనం నింపుకున్న ప్రేమ ప్రతిబింబం
మా ఇంట వెలుగులీనే మణిదీపం
మనసున్న మాణిక్యం!

అవకాశం ఇస్తే తనను తాను
నిరూపించుకునే "పట్టు" హృదయిని!

మమతల మువ్వలు కట్టితే
భద్రత గూటిలో పొదిగితే
సకల కళలలో ఆరితేరగల సమర్ధిని!

తేదీ:29.9.2023

# 46. దివా నక్షత్రాలు

జాతి విముక్తికై పోరాడిన
స్వాతంత్ర్య సమరయోధులు
స్వసుఖాన్ని త్యాగం చేసి దేశం
కోసం పోరాడే వీరజవానులు ;

తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి
రోగులకు సేవ చేసే వైద్యసిబ్బంది
అహర్నిశలూ శ్రమించి పరిశోధించి
మానవాళి సౌకర్యానికై నూతన
పరికరాలను, ఔషధాలను కనిపెట్టే శాస్త్రవేత్తలు ;

మానవత్వానికి ప్రతీకలుగా ఆర్తులకు
చేయూతనందించే పరోపకారులు
పరులకై రక్తదానం, అవయవదానాలు చేసే దాతలు ;

వ్యక్తిగత సౌఖ్యం మరచి
విపత్కర పరిస్థితుల్లో సైతం ఆపదలో నున్నవారిని
ఆదుకొనే రక్షకభటులు కాలుష్యపు కూడలిలో
ఎండావానల్లాంటి ఇబ్బందుల్ని లెక్కచేయక నిలబడి
వృత్తిధర్మాన్ని నిర్వర్తించే
వాహన రాకపోకల నియంత్రణా సిబ్బంది ;

ఇంకా ఎందరో మహానుభావులు
ప్రజాసౌఖ్యానికై పాటుపడుతూ
దివానక్షత్రాల్లా వెలుగులీనే
కిరీటరహిత శోభితాలు
అందరికీ వందనాలు !

తేదీ:30.9.2023

# 47. వ్యక్తిత్వ పరీక్షలు

కష్టాల్లోనే మనిషి సత్తా
ఎంతో వెల్లడయ్యేది!

ఉలిదెబ్బలకోర్చుకున్న శిల శిల్పమైనట్లు
సమ్మెట దెబ్బలు తిన్న
బంగారం తీగ సాగినట్టు
కష్టాలే మనిషి వ్యక్తిత్వాన్ని నిగ్గు తేల్చే పరీక్షలు!

నవమాసాలు తల్లి కష్టపడి
మోస్తేనే కదా నీ పుట్టుక!

కష్టాల చెమట చిందిస్తేనే కదా
లక్ష్యాల పంట పండేది
కష్టపడి చదివిన విద్యార్థే
మరి ఉన్నత స్థానాన్ని పొందగలిగేది!

తేనెటీగలా కష్టపడితేనే
అందుతుంది జీవన మకరందం!

కష్టాలకు ఓర్చినవాడే
సుఖాల విలువను
గ్రహించగలడు
మనసారా ఆస్వాదించగలడు!

కష్టాలను గౌరవిద్దాం
ఇష్టంగా కష్టపడుదాం
కష్టసుఖాలు కావడికుండలనే
సత్యాన్ని గ్రహిద్దాం!

తేదీ:1.10.2023

# 48. నిషా నిశీధులు

సినిమా హీరో స్టైల్గా రింగురింగుల
పొగ వదులుతున్నాడనో
మిత్రుల ముందు పరువుపోతుందనో
అమ్మాయిలు ఆరాధనగా చూస్తారనో
నల్లని రసాయనాల విషం తాగి
గాలితిత్తులను మసిబారనీయకు
నీ బ్రతుకును నుసి చేసుకోకు!

దమ్ము లాగే  ఆనందం
నీకు దమ్ము ఆడకుండా
ఉక్కిరిబిక్కిరి చేస్తుంది!

గుట్కా, జర్దా, పాన్ మసాలా
రూపమేదైనా పొగాకు రూపాంతరాలే...
హుషారు ఎక్కిందను భ్రమతో
నిన్ను పీల్చి పిప్పిచేసే నిషా నిశీధులే!

దురలవాటు అంటుకోవడం సులభం
వదిలించుకోవడం దుర్లభం!

నీకంటే అధికంగా
నీ చుట్టుపక్కలుండేవారికి,
నీ కుటుంబంలోని వారికి చేటు చేసే
ధూమపానానికి దూరంగా ఉండు!

వద్దు, లేదు, కాదు అని నిక్కచ్చిగా
చెప్పే జీవన నైపుణ్యాలను అలవరచుకో
నీ భావిని తీర్చిదిద్దుకో!

తేదీ:2.10.2023

# 49. జీవన సమరం

స్వాతంత్రం సిద్ధించింది
సమరం సాగితేనే!

నాలుగు వేళ్ళు నోట్లోకి వెళ్లాలంటే
నిత్యం సమరమే బడుగుజీవులకు!

ఉదయపు వేళల్లో మహిళకు
వంటింట్లో జరిగేది సమరమే
సమయానికి అందరికీ అన్నీ సమకూర్చేందుకు
ఉద్యోగినికైతే మహాసంగ్రామమే!

బలహీనులకెప్పుడూ
బలవంతులతో సమరమే
తాము నిలదొక్కుకొనాలంటే!

మధ్యతరగతి జీవికి నిరంతరం
సమరమే సమస్యలతో!

ప్రాణం నిలుపుకొనుటకు
ప్రాణాంతక వ్యాధులతో సాగేది సమరమే!

సైనికులకు జీవితమంతా
శత్రుసైనికులతో సమరమే!

జయం పొందినా..అపజయం అందినా
జననం నుండి మరణం దాకా
తప్పదు సమరమే!

పరుల  కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి
సమరం సాగించే పలువురు
సాహసవంతులకు పలు ప్రణామాలు!

తేదీ:3.10.2023

# 50. నీ చుట్టూరా చూడు

సన్నని దారాలతో నేసిన
అందమైన గుండ్రని గూడు
ఒక్క చీపురు దెబ్బకే ఛిద్రమైతే
మరల గూడునల్లే
సాలెపురుగు కాదా నీకు స్ఫూర్తి?!

ఒక్కో పుల్లా, ఒక్కో పుడకా
ముక్కున కరచి తెచ్చి కష్టపడి గూడునల్లి
గాలివాటుకు చెల్లాచెదురైతే
మళ్లీ కట్టే పక్షి కాదా నీకు స్ఫూర్తి?!

మొదలంటా నరికినా.. మరలా చిగురించే
తరువు కాదా నీకు స్ఫూర్తి?!

కాళ్ళు లేకపోయినా నాట్యప్రదర్శన చేసేవారు..
కళ్ళు లేకపోయినా అన్ని
పనులూ స్వంతంగా చేసుకునేవారు..
ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నా
ప్రశాంతమైన చిరునవ్వును
పంచేవారు కాదా నీకు స్ఫూర్తి?!

నీ చుట్టూరా చూడు నీలో స్ఫూర్తిని నింపేవెన్నో!
చిట్టి చీమ కూడా గట్టి స్ఫూర్తినే కలిగిస్తుంది
తనకన్నా రెట్టింపు బరువును మోస్తూ!

చూడగలిగే హృదయం నీకుంటే...
పరిశీలించగలిగే సహనాన్ని అలవరచుకుంటే!

తేదీ: 4.10.2023

# 51. నీ చేతిలో లేని వాటికై చింత మాను

వ్యర్థ విషయాలను
నకారాత్మక ఆలోచనలను
అరిషడ్వర్గాలను మెదడు
నిండా నింపుకుని..

జరిగిపోయిన గతాన్ని
జ్ఞప్తికి తెచ్చుకుని వగస్తూ
మార్చలేని వాటిని.. మార్చాలని ప్రయత్నిస్తూ!

అనవసర ఆలోచనలతో
నిండిన చెత్త బండి లాగుతూ
వేడెక్కిన మెదడు భారాన్ని మోస్తూ!

ఎదురైన సమస్యల్ని
భూతాల్లా భావించి
భూతద్దంలో చూసి భయపడి
శిరోవేదనకు లోనవుట కంటే...

మార్చలేని, మన చేతిలో లేని
విషయాల చింత మానేసి
నీ చేతనైనది చేస్తూ
సకారాత్మక ఆలోచనలతో
ఆశావహ దృక్పథాన్ని పెంపొందించుకొని
అందమైన మధురానుభూతుల
ఆస్వాదనలో తేలియాడుతూ.. ఆనందించు జీవితాన్ని!

పరులకు ఆనందాన్ని పంచుతూ
సాధించు మానవజన్మ పరమార్థాన్ని!

తేదీ:05.10.2023

# 52. వచన వింజామరలు

ప్రియ వచనాలు
పిరికితనాన్ని పారద్రోలే
ధైర్య వచనాలు
నిరాశ నిండిన మనసుకు
ఆశా గీతికలు
వేదన నిండిన హృదయానికి
ఉపశమన పూతలు!

ఊరడించి ఊపిరులూదే ప్రాణదాతలు
వక్రదారినుండి మళ్లించి సక్రమమార్గాన
నడిపించే నైతిక బోధనలు
ఎడతెగని ఆందోళన నుండి
మనసును మళ్లించే మధు గుళికలు!

బాధను తగ్గించే ఔషధాలు
ఆత్మనిబ్బరాన్ని కలిగించే
మలయమారుతాలు
ఆవేదనా తాపాన్ని తగ్గించి
హాయినిచ్చే వింజామరలు!

తేదీ:6.10.2023

# 53. పాలనా పంచతంత్రం

అన్నెంపున్నెం ఎరుగని
అమాయక చేతల మనసుతోట
ఆశానిరాశల మధ్య ఊగిసలాట
నిరంతరం పంటపైని ధ్యాసతోనే తండ్లాట!

జీవితమంతా ఊహించని
ఘటనల సమాహారమే
కలుపు మొక్కలతో,
పురుగు మందులతో సహవాసమే
ప్రకృతి వైపరీత్యాలతో పోరాటమే
ఆరుగాలం కష్టానికి ఆవేదనల
ప్రతిఫలమే!

రైతే రాజంటూ,దేశ వెన్నెముక అంటూ
జై కిసాన్ అంటూ
జే కొడుతూ జోకొట్టే ప్రయత్నమే
వాడిపోయే పొగడ్తదండల సన్మానమే!

అటు "అగ్రిసెస్" వెన్నపూతలు
ఇటు డీజిల్ ధర పెంపు సున్నం రాతలు
మాటల్లో తప్ప చేతల్లో అందని సాయం
పాలనాధికారుల పంచతంత్రం!

నేడెంతో రేపూ అంతే
ఎక్కడ వేసిన గొంగళి తంతే
రైతు బ్రతుకు చిత్రం మారదంతే!

తేదీ:7.10.2023

# 54. కలలా కరిగే కాలం

బాల్యంలో...
వాన కురిసినా
మెరుపు మెరిసినా
హరివిల్లు విరిసినా
కాగితపు పడవ నీటిపై తేలినా
అంతా గారడీ!

కౌమారంలో...
ప్రేమికు(డు)రాలు నవ్వినా
మాటలు రువ్వినా
క్రీగంటి చూపులు విసిరినా
కనులు కనులు కలిసినా అంతా కనికట్టు!

యవ్వనంలో నవదంపతులకు
కలిసి విహరించినా
అడపాదడపా కలహించినా
మౌనంగా ఉన్నా.. మాటలతో విసిగించినా
అంతా ఇంద్రజాలం!

వృద్ధాప్యంలో...
సంతానం చిలిపి చేష్టలు తలచుకున్నా
గతించిన కాలం గుర్తుచేసుకున్నా
పౌత్రుల ముద్దు ముచ్చట్లతో కాలం గడుపుతున్నా
నెరసిన జుట్టును, వడలిన దేహాన్ని గమనించుకున్నా...

అరే... కాలం కలలా కరిగిపోయిందే!
ఇదేనేమో కాలం చేసే మహేంద్రజాలం!

తేదీ:8.10.2023

# 55. రూపవిక్రియ

మునురూపము అసహ్యకరము
మలిరూపము మనోహరము
పోలికయే లేని రూపవిక్రియ
మానవులకు మార్గదర్శకము!

చెంతకొచ్చి మురిపిస్తూ చేతుల్లో వాలిపోతూ
పట్టుకో పట్టుకోమని కవ్విస్తూ
పట్టుకోవాలనుకుంటే తుర్రుమని పారిపోతూ!

పూవుపూవునా వాలుతూ
మకరందం త్రాగి తుళ్ళుతూ
గాలిలో గంతులు వేసే
సీతాకోకచిలుక కనువిందు చేసే!

కొనగోటిపై సీతాకోకచిలుక
వచ్చి వాలితే ఎంతటి ఆనందమో
కోరకుండానే కోరుకున్న
పెన్నిధి స్వంతమైతే ఎంతటి సంతోషమో!

అల్లరల్లరిగా స్వేచ్ఛగా విహరించే సీతాకోకచిలుక
వచ్చి వాలింది నా చెంత అల్లరి మాని బుద్ధిగా
అమ్మ ఒడిని చేరిన చిన్నారిలా!

మకరంద ఆస్వాదనతో
అలసిన సీతాకోకచిలుక
భుక్తాయాసంతో విశ్రమించెను
కాబోలు మెత్తని పూ ఒడిలో!

తేదీ: 9.10.2023

# 56. ఓటములే నిచ్చెనమెట్లుగా

మూసిన కనురెప్పల వెనుక
ముసిరే ఆలోచనలెన్నో!
మూసిన తలుపుల వెనుక
తలుపుతట్టే అవకాశాలెన్నో!

అవకాశాల తలుపులు మూసుకొన్నప్పుడు
తెరచుకొనే ప్రయత్నాలు
వేయి చేసేది కొందరు
అవకాశం తలుపు తడుతున్నా
కన్నులు,చెవులకు
గంతలతో మరికొందరు!

ఆశలన్నీ తలక్రిందులైనాయని
నిరాశతో వగచేది కొందరు
అవకాశం ఒకచోట ఉంటే
తలక్రిందులుగా ఆలోచించి
వేరొకచోట వెతికేది ఇంకొందరు!

పగటికలలతో త్రిశంకుస్వర్గంలో
విహరించేవారు కొందరు...
అవినీతి అడ్డదారులు తొక్కేవారు మరెందరో!

ఓటములను నిచ్చెనమెట్లుగా మలచుకొని
కృషి,పట్టుదలలతో
ఆశావాదంతో ఎగబాకేవారే
గెలుపు శిఖరం చేరగలరు
విజయకేతనం ఎగరేయనూగలరు!

తేదీ:10.10.2023

# 57. రహస్య పేటిక

ఆలోచనల అలలు
ఉవ్వెత్తున ఎగసిపడే
లోతెంతో తెలియని
అంతరంగ సంద్రం!

బయటకు వెలిగ్రక్కలేని
భావాలనెన్నిటినో దాచుకున్న
రహస్య పేటిక!

వెల్లడి చేయకూడని చిలిపి,
మధురానుభూతుల గుప్తనిధి!

మంచి చెడులకు మధ్య సాగే
రణ కురుక్షేత్రానికి సాక్షి
మంచి జయిస్తే మానవుడు
చెడు జయిస్తే దానవుడు!

మనిషి వ్యక్తిత్వానికి పరీక్ష
పెట్టే గురువు
ఉత్తీర్ణత సాధిస్తే పూలబాటలో
జీవన పయనం
అనుత్తీర్ణుడైతే ప్రతి నిముషం
తొలిచే అపరాధ భావనతో
జీవితం అశాంతి నిలయం!

తేదీ:11.10.2023

# 58. నాలుగు రోడ్ల కూడలి

కౌమారం కలలకు నిలయం!

ఏదో సాధించాలి
అనుకున్నది తప్పక చేయాలి
ఆశయాన్ని నెరవేర్చాలి
అందమైన గమ్యం చేరాలి
అని కలలు కనే తరుణ
వయసు!

తికమక పెట్టే తలపులు
తొందరవందర చేసి ఉసిగొలిపే
రసాయనాలు...
ఆకర్షణ వలలు చుట్టుముట్టి లాగుతూ
తపనలు తమకాలు కలిగించే
హార్మోన్ల మాయాజాలంతో
చిందరవందరగా,అల్లరిచిల్లరిగా
మార్పు చెందే మనసుతో
మసలే తరుణ వయసు!

ఆశల పల్లకిపై ఊరేగే మనసు
ఆరాటపడుతూ కలవరించగా
ఏది మంచో,ఏది చెడో తేల్చుకోలేని
సందిగ్ధావస్థలో నలుగుతూ
ఏ దారిన వెళ్లాలో తేల్చుకోలేని
గజిబిజి గందరగోళంతో
అది ఒక నాలుగు రోడ్ల కూడలి!

స్నేహితుల వాక్కులే వేదాలుగా తోస్తూ
తనకు తానే ప్రత్యేకంగా అనిపిస్తూ
తనకు అన్నీ, అంతా తెలుసుననే భ్రమలో
మరో ప్రపంచంలో విహరించే స్వర్ణయుగమది!

గురువుల మార్గదర్శనం
వెళ్లవలసిన దారి చూపగా
కుటుంబం నైతిక విలువలకు బాటవేయగా
సరైన దారిని సాగితే
జీవితాన  సంతోషపు వెలుగుల
వెండివెన్నెల ముస్తాబై ఎదుటే నిలుస్తుంది!
చెడు దారిని ఎంచుకుంటే అంధకారం
అధఃపాతాళానికి తోసేస్తుంది!

తేదీ:12.10.2023

# 59. అన్నీ ఒకటే కాదు

రాయే...

ఉలితో చెక్కితే బొమ్మ
చేయెత్తి మొక్కితే అమ్మ
రూపాన్ని బట్టి విలువ!

రాయి ఒకటే
కాలికి తాకితే గాయం
చేత్తో పైకెత్తితే ఆయుధం!

రెండూ రాళ్లే
గులకరాయి
గుండ్రాయి
పరిమాణాన్ని బట్టి
పేర్లలో తేడా!

మూడు రాళ్లను ఒకచోట
చేర్చితే పొయ్యిగా
రూపాంతరం!

ఇవి కూడా రాళ్లే
సున్నపురాయి
పాలరాయి
నాపరాయి
మన్నిక,నాణ్యతను బట్టి
వాటి విలువలో మార్పు!

నేడు రాయనుకున్నది
రేపు రత్నమవ్వొచ్చు
విలువెంతో పెరగొచ్చు
దుమ్ము,ధూళి తొలగించి
సానపెడితే!

నిర్జీవమైనవే రాళ్లు
మానవత్వం లోపించి
గుండె బండరాయైన మనుషుల్లా!

రాళ్ళ లోపల పూలు పూయనూవచ్చు
పసిపాప బోసినవ్వుతో
మమత చిగురించిన మనసులా!

అన్ని రాళ్ళూ ఒకటి కాదు
ఏ రాయైనా
దేని విలువ దానిదే...
దేని ప్రత్యేకత, ప్రాముఖ్యత దానిదే మనుషుల్లాగే!

తేదీ:13.10.2023

# 60. ప్రతిదీ పనికొచ్చేదే

సూది చేసే పని గొడ్డలి చేయలేదు
గొడ్డలి చేసే పని సూది చేయలేదు
ఏ పనిముట్టు ప్రాముఖ్యత దానిదే!

ఏదీ తక్కువ కాదు...
ఏదీ ఎక్కువా కాదు!
అన్నీ పనికి అవసరమైన
పనికొచ్చే పనిముట్లే
పనిని సులభతరం చేసేందుకు కనుగొన్నవే!

అధునాతన పనిముట్ల అవసరమెంతో ఈనాడు
వంట పని,ఇంటి పనులతో
సతమతమయ్యే గృహిణులకైనా...
వ్యవసాయంతో అతలాకుతలమయ్యే
హాలికులకైనా!

కొడవలి,రంపం
గొడ్డలి, నాగలి
సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు
నా వినిపించే నవీన గీతికి
ప్రాణం–ప్రణవం
అని పనిముట్ల ప్రాముఖ్యతను,
శ్రమ సౌందర్యాన్ని చాటారు ఆనాడే
విప్లవ మహాకవి శ్రీ.శ్రీ.

వాడుతూ ఉంటేనే...
పదును పెడుతూ ఉంటేనే...

పరిశుభ్రపరుస్తూ ఉంటేనే...
పదిలంగా చూసుకుంటుంటేనే
పనిముట్టుకైనా
మనిషి మెదడుకైనా
ఎక్కువకాలం మన్నిక!

ప్రతి పనికీ
మీటలు నొక్కే పనిముట్లు ఎక్కువై
మెదడుకు, దేహానికి పనిలేక
సోమరి అవుతున్నాడు మానవుడు!

అవసరం ఉన్నంతవరకూ వాడుకుని
ఆవల పారవేసే పనిముట్లయినారు
నేడు తల్లిదండ్రులు!

ఎంత శోచనీయం!

తేదీ:14.10.2023

# 61. తెలిసి...తెలిసీ..

చూపులకు ఆనినట్టే ఉంటూ
చేతికి అందినట్టే ఉంటూ
చప్పున చేజారే అవకాశాలు!

ఆకర్షించే ఆశాపాశాలు
అంతులేని వ్యామోహాలు
మయసభలోని మడుగుల్లా తలపిస్తూ
అడుగేయగానే నిండా ముంచేస్తూ
ఫక్కున నవ్వే పాంచాలిలా
గుచ్చుకునే నిరాశా నిట్టూర్పుల పరిహాసాలు!

నిజమైన ప్రేమానుబంధాలు,
సంతోషాలు విడిచి
పేరు ప్రతిష్టలకై కాసుల మూటలకై పరుగుపందాలు
అసలైన విలువలు కనుగొనేలోగా
అదృశ్యమయ్యే సమయాలు!

ఎండమావులని తెలిసీ
ఆకర్షణలో పడి
మాడి మసైపోయే
అమాయక ప్రాణాలు!

మరీచికలని తెలిసీ
మాయలో పడుతూనే ఉంటారు
దూరంగా కనబడగానే అందుకునేందుకు
పరుగులెడుతూనే ఉంటారు!

తేదీ: 15.10.2023

# 62. మైకాసురులు

మైకు దొరికిందంటే చాలు
ఊకదంపుడు ఉపన్యాసాలతో
ఊదరగొట్టేస్తారు
ఎవరో వ్రాసిచ్చినదాన్ని
అటుదిటుగా చదువుతూ మైకు పగిలేలా అరుస్తూ!

అందరూ తననే చూస్తూ
వింటున్నారన్న గర్వంతో, ఉత్సాహంతో
విషయమేమీ లేకపోయినా సాగదీస్తూ
ఇహ పోతే తెలియజేసుకునేదేమంటే
వంటి నలిగిపోయిన, అరిగిపోయిన
పడికట్టు పదాలతో శ్రోతల బుర్రలు తింటూ!

డబ్బులిచ్చి కొట్టించుకున్న
చప్పట్లతో చెలరేగిపోతూ
పనికిరాని సందేశాలనిస్తూ
తమ ధోరణిలో తామే చెప్పిందే చెప్తూ
ఛలోక్తులు పేలుస్తున్నాననుకుని
నోటికొచ్చిందేదో ప్రేలుతూ!

సందర్భశుద్ధి లేకుండా
అడ్డూ ఆపూ లేకుండా
అన్ని విషయాలపై అనర్గళంగా వాగుతూ
అడ్డుకున్నవారిని నెట్టేసే మైకాసురులారా మీకో దండం!
దిగిపోండిక ఆపి మీ దండుగమారి దండకం!

తేదీ:16.10.2023

# 63. మిథ్యాడంబరం

ఆస్తి మూరెడైనా.. ఆశ బారెడై..
కోరికల గుర్రాలెక్కి
ఉన్నదానితో తృప్తిచెందక
ఉచ్ఛ స్థాయికి చేరాలనే వెర్రి ఆశతో
పుట్టిన చోటల్లా పుట్టెడు
అప్పులు అలవాటుగా చేస్తూ
పక్కకొస్తే పారిపోయేలా
అప్పుల అప్పారావుగా పేరు గడించి!

దేశానికే తప్పలేదు...నేనెంత
మొదటి తారీఖు తీర్చొచ్చులే
అని ఆత్మవంచనతో, మొండిధైర్యంతో
ఒకచోట తీసుకుని, మరోచోట ఇస్తూ
అప్పు చేసి పప్పుకూడు తింటూ
స్థోమతకు మించి స్థిరాస్తులు, చరాస్తులు జమచేసుకుంటూ
తలకు మించిన అప్పుల్లో నిండా మునిగాక
నెల నెలా పెరిగి తడిసి మోపెడైన వడ్డీతో నడ్డి విరిగి!

అనుకోని ప్రమాదాలు అవసరాలు మీదపడి
ఉన్నదంతా ఊడ్చుకుపోయాక
రంగు వెలిసిన నక్క బాపతు అయ్యాక!

ఆత్మహత్యే శరణ్యమనుకుని
ఇంటిల్లిపాదితో పాటు
తన ఉసురూ తీసుకుంటూ
మధ్యతరగతి మానవుని మిథ్యాడంబరం!

తేదీ:17.10.2023

# 64. ఋతురాగాలు

కమ్మని కుహూ రాగాల కోయిల గానం
ఝుమ్మను భ్రమరాల ఝుంకార నాదం
వలపులు విరియింపజేసే వసంత ఋతురాగం!

వెనువెంటనే వచ్చును
మండే ఎండల గ్రీష్మం
కలనైనా కనని సమస్యల సమాహారమై!

చిరుజల్లుల మధ్య మెరిసే
హరివిల్లుల వర్షఋతువు
తటాలున మెరిసే తటిల్లతలతో
తనువును పులకరింపజేస్తూ
జీవితంలో అనుకోని ఆనందాల ప్రతిరూపమై!

తుషారబిందువుల సోయగాలతో
కనువిందుల చేమంతుల హేమంతం
గిలిగింతల సంతోష సమయాల ప్రతిబింబమై!

నిండైన పున్నమి వెన్నెల కాంతుల శరత్తు
సంతృప్తి చెందిన అనుభూతుల తార్కాణమై!

నిరాశా శిశిరం నెరవేరని ఆశల నీడై!

ఋతువులైనా, జీవితమైనా
చక్రభ్రమణ స్వభావమే కదా
మధుమాసమై ఉంటే ఎద
ఆరు ఋతువులూ ఆమనే సదా!

తేదీ:18.10.2023

# 65. మంచికాలపు మహోదయం

కలిగిననాడు మిడిసిపడక
లేనినాడు వెలితిపడక
పొగడ్తల అగడ్తలో కూరుకుపోక
తెగడ్తలకు నిరాశతో క్రుంగిపోక
ఆత్మవిశ్వాసంతో నిలదొక్కుకుని!

జీవితంలో ఊహించని
సంతోషాల వర్షపుజల్లుల్లో తడుస్తూ
ఆవేదనల తుఫానులు తట్టుకుంటూ
హేళన మాటల వేసవి వడగాడ్పులను ఎదుర్కొంటూ!

అవమానాల ముళ్ళు గుచ్చుకుని తల్లడిల్లినా
నిర్లక్ష్యంగా వీచే నిరాదరణ చలిగాలికి  వణికినా
అనుభవాలతో రాటుదేలిన వృక్షంలా
అందరూ తనను విడిచి వెళ్లినా
శిశిర వసంతాలు చక్రభ్రమణమేనని ఎరిగి!

తామరాకుపై నీటిబిందువులా
స్థితప్రజ్ఞత జిగురుతో స్థిరంగా నిలిచి
జీవితంలో వసంతాగమనానికై నిరీక్షించాల్సిందే
మంచికాలపు మహోదయానికై
ఆరాట పోరాటాలను చేస్తూ ఉండాల్సిందే!

తేదీ:19.10.2023

# 66. పట్టు విడువని పట్టుదల నీకుంటే

పూరిగుడిసెనైనా పున్నమి వెన్నెలతో వెలిగించవచ్చు
పేద ముంగిలినైనా కళాకాంతుల
రంగవల్లులతో తీరుగా తీర్చవచ్చు!

సరైన సౌకర్యాలు లేకున్నా
బరిలో నిలిచి
వేలమందిని ఓడించి
విజయాన్ని సాధించవచ్చు!

సదుపాయాలు సరిగా లేకున్నా
సరిలేరు నీకెవ్వరూ అనేలా
నిలవొచ్చు!

పేదరికం ఉన్నా పెద్దస్థాయికి చేరవచ్చు!

సంపద లేకున్నా దాతలు కావచ్చు!

అవయవలోపమున్నా
ఆకాశాన్ని అందుకోవచ్చు!

అవసరమే కొత్త పాఠాలు నేర్పుతుంది
ఆత్మవిశ్వాసమే నూతన బాటలు పరుస్తుంది!

గురువు ఎదురుగా లేకున్నా
విలువిద్యలో ప్రావీణ్యత సంపాదించిన
ఏకలవ్యుని చరిత చదివావా?

పేపర్ బోయ్ గా మనుగడ సాగించి
మన దేశ రాష్ట్రపతి పదవినధిరోహించిన

అబ్దుల్ కలాం స్ఫూర్తి
జీవిత ప్రస్థానం గురించి తెలుసుకున్నావా?

భార్య కొరకు
ఒంటరిగా కొండను తవ్వి
వేల మైళ్ళ రహదారి పరచిన
వ్యక్తి వార్త విన్నావా?

రహదారి పక్కన వేల మొక్కలు నాటిన
ఖమ్మం రామయ్య గాథ విన్నావా?

ఒంటి చేత్తో వేల మైళ్ళు విస్తరింపజేసిన
తిమ్మమ్మ మాను కన్నావా?

మనసంటూ ఉంటే
ఆ మనసు నిండా దృఢ సంకల్పం ఉంటే
పట్టిన పట్టు విడని
పట్టుదల నీకుంటే
మార్గం తప్పకుండా ఉంటుంది!

తేదీ: 20.10.2023

# 67. హృదయ పరావర్తనం

అశాంతి, అసూయాద్వేషాలు
లేని నిష్కల్మష హృదయమే
చిద్విలాస వదనమున పరావర్తనమగు
సహజమైన అందము ద్విగుణీకృతమగు!

చిరకాలం ఉండేవే
చింతలు వంతలు
ముఖంపై చిగురంత చిరునవ్వుతో
చిత్రంగా పారిపోవు చింతలు!

అనారోగ్యాన్ని పారద్రోలే దివ్యౌషధమే అది
ఆనందాన్ని అందించే చిరుదీపం అగునది!

శతృత్వ భావన మనసునుంచి వీడు
ఓసారి ముఖంపై చిరునవ్వుతో
స్వాగతం పలికి చూడు
చుట్టూ ఉన్నవారు స్నేహంతో దరిచేరు!

అపరిచితులను ఆత్మీయులను
చేయు చిరునవ్వు
అనుబంధాలను పదిలపరిచే చిరునవ్వు
చెరగనీకుమా నీ ముఖంపైని చిరునవ్వు!

పెదవులపై విరబూసే చిరునవ్వుతో
పదునాలుగు ముఖకండరాలకు
కలుగును వ్యాయామం
ముఖంపై చిరునవ్వుతోనే పూర్తగును కదా అలంకారం!

తేదీ:21.10.2023

# 68. ప్రగతా...పతనమా?!

అంతరిక్షపు అంచులకు పయనించినా
అంతరంగంలో అరిషడ్వర్గాలకు దాసోహమే!

కృత్రిమ త్రిశంకు స్వర్గాలెన్ని సృష్టించినా
ఆలోచనలు అధఃపాతాళమే!

సృష్టికి ప్రతిసృష్టి చేసే
ప్రయత్నాలు ఫలించినా
ప్రకృతి వినాశనానికి
దారులు పరచడమే!

ఆస్తులు ఇబ్బడిముబ్బడిగా సంపాదించినా
ఆరోగ్య మహాభాగ్యం గాలిలో దీపమే!

అరచేతిలో వైకుంఠ దర్శన సౌలభ్యమున్నా
అమ్మానాన్నలకు వృద్ధాప్యంలో
ఆసరా నిండుసున్నా!

మనుష్యులెంత దగ్గరగా మసలినా
మానవత్వం వెతికితే శూన్యమే!

ఖండాంతరాలను చిటికెలో దాటినా
కులం,మతం,వర్ణాల,జాతుల
అడ్డుగోడలు దృఢమే!

అన్ని రంగాలలో అతివలు
దూసుకుపోతున్నా..భద్రత దినదినగండమే!
ప్రపంచమా... నీ పయనమెటు?
ప్రగతి పథం వైపా... విలువల పతనంకేసా?!

తేదీ:22.10.2023

# 69. పట్టశక్యమా

వడివడిగా, ఉరవడిగా
వేగంగా ఉత్సాహంతో
పరుగులతో ఉరకలెత్తడమే దాని నైజం
చైతన్యమే దాని ఒరవడి!

పట్టశక్యము కాని
పరిధులసలే లేని
అలజడే దాని ప్రవాహం!

ఏవి అడ్డొచ్చినా
ఏది ఎదురొచ్చినా
గమనించక
దేన్నీ లక్ష్యపెట్టక
దూకుడుగా దూకేస్తుంది!

తుళ్ళుతూ, గెంతుతూ
కొండలపై, బండలపై జలజలా జాలువారుతూ
తదుపరి పరిణామాలను తలంచక
అన్నిటినీ తడిపేస్తూ ధారగా కురుస్తూ
ఆనందాల జల్లులను చిలకరిస్తూ
తన దారిన తాను సాగిపోతూనే ఉంటుందలా..
యవ్వనం ఓ జలపాతమే!

తనలో నిబిడీకృతమైన చైతన్యశక్తిని
సరైన మార్గదర్శకత్వపు టర్బైన్లపై నడిపిస్తేనే
విద్వత్తు విద్యుచ్ఛక్తిని జ్వలింపజేస్తేనే
సాధ్యం దేశప్రగతి!

తేదీ: 23.10.2023

# 70. విలువలు చెల్లిన కాలం

పూజారి పళ్ళెంలో గలగలలాడే నాణేలు
నవగ్రహాలకు బదులుగా
పూజలందుకునే నాణేలు!

ఒక్కో నీటిబిందువు కలిస్తే సంద్రమే
చిల్లరేనని చీప్ గా చూస్తే ఎలా?
తొంభై తొమ్మిది పైసలు కలిస్తే
ఒక్క రూపాయ
బాలల అక్రమ రవాణాతో
బాంబేలో చిల్లర నాణేల మాఫియా!

అణా, అర్ధణా, అర్ధ రూపాయ
నాణేలు చెల్లే కాలం చెల్లిపోయింది
కనపడని రూపాయలతో
సాంకేతిక చెల్లింపు సాధ్యమయ్యింది!

బొమ్మా బొరుసు ఆటలు
గత జ్ఞాపకాలయ్యాయి
నైతిక విలువలు,అనుబంధాలు
చెల్లని నాణాలై
అహం,స్వార్థాల రూకలు రాజ్యమేలుతున్నాయి!

పది పైసలు పెట్టి పాలకోవా
కొన్నంత ఆనందం
పదుల రూపాయలు పెట్టి
పెద్దవస్తువు కొన్నా రాదేలనో?!

తేదీ: 24.10.2023

# 71. మానవతా మొక్క

మిన్నంటే ఆకలి కేకలు
ఆపదలో ఉన్నవారి ఆర్తనాదాలు
ప్రమాదాల బారిన పడిన వారి రోదనలు
కష్టాల కొలిమిలో ఉన్నవారి వేదనలు
తామున్న స్థితిని తెలుసుకోలేని
బాలబాలికల బేలచూపులు
అవయవ దాతలకై అసహాయుల నిరీక్షణలు!

అందరివీ అన్ని బాధలూ
నీవు తీర్చలేకపోవచ్చు
నీ కళ్ళకు కనపడేవి
నీ చుట్టుపక్కల తారాడేవి
నీవు నడయాడే దారిలో నిలిచేవి
ఎన్నో...ఎన్నెన్నో!

ఓ మంచి మాట సాయమో
చేతి సాయమో
ఆర్థికమైన ఆలంబనో
ఏదో రూపంగా
నీ చేతనైన చేయూత నందించు!

ఉడుతాభక్తిగా పరోపకారబుద్ధిని చాటు
తక్షణమే మానవతామొక్కను నాటు!

తేదీ: 25.10.2023

# 72. నీకంటూ ప్రత్యేక గుర్తింపు

నీ కంటూ ప్రత్యేక గుర్తింపునిచ్చేది
ఏ ప్రలోభాలకూ లోనుకానిది
ఎవరికీ తలవంచనిది
ఎవరి వద్దా చేయి చాచి ఎరుగనిదే
ఆత్మాభిమానమంటే!

అలవికాని ఆత్మాభిమానంతో
అపనిందను మోయలేక
అసువులు సైతం బాసేవారు కొందరు!

అందలాలు ఎక్కుటకై
అనవసర ఆర్భాటాలకై
ఆత్మాభిమానాన్ని తాకట్టు
పెట్టేవారింకొందరు!

చేతకాదన్న పనిని
చేసి చూపించేలా చేస్తుంది
మూర్తీభవించిన ఆత్మాభిమానం!

అదే శృతి మించితే
దుర్యోధనుని దురభిమానంలా
స్వీయ నాశనం గావిస్తుంది!

రంగు ఏదైతేనేమి
రూపు ఏలాగున్ననేమి
ఆత్మాభిమానం తోడుంటే
అన్నిటిలో గెలుపు నీదే!

తేదీ:26.10.2023

# 73. శాంతి మంత్రం

అనాలోచిత మాటలు
నవ్వుతూ అంటించే చురకలు
కాకిపై,పిల్లిపై పెట్టి సాగించే పోట్లాటలు
కారణం లేని యుద్ధాలై బయటపడేది
మనసుమూలల్లో దాచుకున్న అసంతృప్తులే!

ఆ ఇంట... ఈ ఇంట...
ఏ ఇంటయినా ఇంటింటి రామాయణమే
ఈ తగవుల పురాణం!

మీ వాళ్ళుఅలా అంటే మీవాళ్లిలా అంటూ...
మూడో మనిషి మధ్యలో దూరితే మొదటికే మోసం!

అంతరంగాన దాగిన భావాలు
వెల్లడి చేస్తేనే మనసుకు శాంతి
అణచుకుంటే లేదు మనశ్శాంతి
అనారోగ్యం పాలై మరుగుపడును సంసారకాంతి!

మలివయసులో మాటలు
తోచక తగవుల కాలక్షేపాలు
గిల్లికజ్జాల గిచ్చుళ్ళు కసురుల విసుర్లు!

సర్దుబాట్లతో సాగేదే సంసారమంటే
ఎన్ని మౌనపోరాటాలు,
మాటల యుద్ధాలు జరిగినా..
సంధి జరగటమేగా
గృహంలో శాంతిని నిలిపే మంత్రం!

తేదీ:27.10.2023

# 74. సాంకేతిక రాయబారులు

టెలిఫోన్ తీగల వేళ్ళు
మాటలతో స్పర్శించిన వేళ
విమానం అద్దాల్లోంచి కనబడుతూ
చేతికందే దూరాన ఉన్న మేఘాల్లా
దూరాన ఉన్నా
చేరువైన భావన!

అక్షరాల అనురాగంతో
కలం ఆలింగనం చేసిన వేళ
కలగలసిన క్షితిజపు అంచులా కనిపిస్తూ
అందుకోలేని దూరాన ఉన్నా
చేరువైన భావన!

చిరునవ్వుల మోము
అద్దంలోని ప్రతిబింబంలా
దరిచేరినట్లు కనిపించే
దృశ్యవీక్షణ వేళ
వేల మైళ్ళ దూరాన ఉన్నా
చెంతనే ఉన్న భావన!

మనుష్యులు దూరంగా ఉన్నా
మనసులను చేరువ చేసే
సాంకేతిక రాయబారులకు
శతకోటి వందనాలు!

తేదీ: 28.10.2023

# 75. శాస్త్రీయ శ్వాస

నియమం తప్పని గ్రహములు
క్రమపద్ధతిగా కక్ష్యలో సంచరిస్తూ
సరళరేఖలో నిలిచినప్పుడు
ఒకదాని నీడ మరొకదానిపై
గొడుగు నీడలా పడినప్పుడు
సంభవించును గ్రహణం!

ఉనికిలో లేని రాహుకేతువులు
సూర్యచంద్రులను మ్రింగుతాయనే
అశాస్త్రీయ విశ్వాసం
అమావాస్య నాటి గ్రహణం అనర్థదాయకమంటూ
నరబలులకు పాల్పడే ఆటవిక నమ్మకం
మేనరికపు వివాహాలతో జన్యులోపాలతో వచ్చే మొర్రికి
గ్రహణానికి లంకె పెట్టే వెర్రితనం
ఆధునిక సాంకేతిక యుగంలోనూ సమసిపోని
అజ్ఞానపు మూఢవిశ్వాసాల మచ్చలు!

గ్రహణం పట్టింది అనాదిగా పాతుకుపోయిన ఆచారాలను
అహేతువాద దృక్పథంతో ఆలోచించే.. ఉన్నత విద్యావంతులైనా
సశాస్త్రీయ కారణాలను ఆలోచించని మేధలకు!

శాస్త్రీయ శ్వాసను పీల్చి హేతువాద దృక్పథంతో
ఆలోచనలు సాగించినప్పుడే
పసి మెదళ్లలో విజ్ఞాన అంకురాలు
నాటినప్పుడే అజ్ఞాన గ్రహణం తొలిగేది!
విజ్ఞాన సూరీడు వెలుగులు విరజిమ్మేది!

తేదీ: 29.10.2023

# 76. ఇక రాలేను నీ కోసం

రానిక నీ కోసం...
కనుల నీలాలు ధారగా వర్షించనీ
నిట్టూర్పుల సెగలు హృదయాన్ని మండించనీ!

రానిక నీ కోసం...
పున్నములు ఎన్నెన్నో వచ్చిపోనీ
మధుమాసం మళ్ళీ మళ్ళీ వచ్చిపోనీ!

రానిక నీ కోసం...
పశ్చాత్తాపంతో మనసు దహించుకుపోనీ
ప్రాయశ్చిత్తపు వాగ్దానం మిన్నంటనీ!

రానిక నీ కోసం...
ఊసుల జ్ఞాపకాలు వెన్నంటనీ
నిశీధి నీరవాలు నిన్నంటనీ!

రానిక నీ కోసం...
తలపుల తలుపులు వేసేశాను
గాఢపు నిశ్వాస గొళ్ళెం పెట్టేసాను!

ఇక  రాలేను నీ కోసం..
నీవు మనసుకు చేసిన
గాయం అటువంటిది...
శిలయై పోయిన మనసుకు
స్పందన ఎలా ఉంటుంది?!

తేదీ:30.10.2023

# 77. మహోత్కృష్టము మానవజన్మ

పుడమిపైనున్న జీవరాశులకెల్ల
ఉత్తమమైనది ఉన్నతమైనది
మానవజన్మ
అన్ని జన్మములకెల్ల ఉత్కృష్టమైనది
మానవజన్మ!

బుద్ధిలో, మేధలో మేటిగా నిలిచినది
యుక్తిలో, శక్తిలో సరిసాటి లేనిది!

నవ్వగలిగే,మాట్లాడగలిగే వరం పొందినది
పరోపకారార్థమే పంచేంద్రియాల
శరీరాన్ని కలిగినది!

చేసిన పాపం చెబితే పోతుంది
చేసిన పుణ్యం కడవరకూ తోడుంటుంది!

పరులకు మేలు చేసే పుణ్యకార్యాలు చేస్తూ
మానవతా పరిమళాలను
పంచుతూ సాగాలి
అరిషడ్వర్గాలను జయించి
అలౌకికానందాన్ని ఆస్వాదించాలి
అవయవదానంతో శాశ్వతత్వం పొందాలి!

తేదీ: 31.10.2023

# 78. బండబారిన గుండె

గిరకపై చేదలతో కడవలతో
తోడుకునేలా సహజ ఉదకంతో నిండి
రుచికరమైన చల్లని నీటితో
దాహార్తిని తీర్చిన ఊటబావులు!

రూపము మారి గొట్టపు బావులై
యంత్ర రొదతో నిండి
ముప్పయి అడుగులకే పరుగెత్తి
ఉరకలెత్తి ఊటలతో ఉబికే పాతాళ గంగమ్మ
నేడు వేయి అడుగులు తవ్వినా
ఉనికి కానరాకున్నది!

వర్ష జలధార జోరుగా కురిసినా
భూమిలో ఇంకే దారి కానరాక
బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూస్తోంది
భూగర్భ జలంతో తడిసే వృక్షాల వేర్లు
దాహార్తితో పరితపిస్తున్నాయి!

ఆకాశహర్మ్యాలు నిర్మించి
ఆకాశాన్ని గెలిచానని
విర్రవీగుతున్న మనిషి అహాన్ని
నీ పునాది అయినా... సమాధి అయినా ఇక్కడే
అంటూ నేలమ్మ కన్నెర్రజేస్తోంది నెర్రెలతో చీలి!

నీటిచెలమను దాచుకున్న రాతిని చూసికూడా..
బండబారిన మనిషి గుండె మారదేలనో?!

తేదీ:1.11.2023

# 79. అందరి బంధువు

కష్టంలో సుఖంలో
బాసటగా నిలిచేది బంధువు
శుభాశుభ కార్యాల్లో
తప్పనిసరిగా తోడుండేది బంధువు!

బంధుత్వాన్ని కలుపుకొని
పబ్బం గడుపుకొనేవారు కొందరు
ఏ బంధుత్వం లేకపోయినా
సాయపడే ఆత్మబంధువులు కొందరు!

కలిమి ఉన్నప్పుడే పంచన చేరేవారు కొందరు
ఏరు దాటి తెప్ప తగలేసేవారు కొందరు!

మురికినీళ్లయినా మంటలను
చల్లార్చడానికి ఉపయోగపడినట్లే
బంధువులు చెడ్డవారైనా
కొన్ని సందర్భాల్లో అవసరపడేవారే!

నాడు వరసలతో మురిసిన బంధుత్వం
మేనత్త మేనమామల ఆప్యాయతతో గడచిన బాల్యం
వేలు విడిచిన వారైనా
వీలు చూసుకుని కలగలుపుకునే తత్వం
నేటి తరానికి వరసలంటే ఏమిటో తెలియని నైజం!

చిరునవ్వుతో పలకరిస్తే మన చుట్టూరా చుట్టాలే
అవసరానికి ఆదుకొంటే నీవు అందరి బంధువువే!

తేదీ: 2.11.2023

# 80. ఎవరి కలల ప్రపంచం వారిది

రోజంతా ఆటపాటలు
పరీక్షల ఒత్తిడి లేని పాఠశాల
అమ్మానాన్నల ఆంక్షలు లేని జీవితం
ఓ విద్యార్థి కలల ప్రపంచం!

ట్రాఫిక్ ఇబ్బందులు లేని ప్రయాణం
తక్కువ ధరకే నిత్యావసర వస్తువులు
హాయైన జీవితానికి సరిపడా జీతం
ఓ మధ్యతరగతి జీవి కలల ప్రపంచం!

వంటపని లేని రోజు
ఎప్పుడూ శుభ్రంగా ఉండే ఇల్లు
ఇంటి పనుల్లో సాయపడే భర్త
ఓ ఉద్యోగిని కలల ప్రపంచం!

ప్రతిరోజూ దొరికే పని
కడుపు నిండా తిండి
పిల్లలకు మంచి చదువులు
ఓ బడుగు జీవి కలల ప్రపంచం!

ప్రతి ఏటా అధిక దిగుబడి
వరదలు, కరువులు రాకపోవడం
ఇంటిల్లిపాదీ ఆరోగ్యంగా,
సంతోషంగా ఉండడం
ఓ రైతు కలల ప్రపంచం!

ఆపదలో ఆదుకొనే బంధువులు
చెప్పిన మాట వినే పిల్లలు
వృద్ధాప్యంలోనూ తోడుండే సంతానం
ఓ గృహస్థు కలల ప్రపంచం!

అవినీతి మచ్చుకైనా లేకపోవడం
పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం
ఆరోగ్యానికై లక్షలు
ఖర్చు పెట్టాల్సిరాకపోవడం
సగటు మనిషి కలల ప్రపంచం!

ఈర్ష్యా ద్వేషాలు లేని ప్రపంచం
నేరాలు,అన్యాయాలు లేని
శాంతిమయ ప్రపంచం
యుద్ధాల ఊసు లేని వసుధైక కుటుంబం
ఇది అందరి కలల ప్రపంచం!

తేదీ:3.11.2023

# 81. బంధాల సుగంధం

పాపాయి సైతం
అనుకరించే చీరకట్టు
చేస్తుంది చూసేవారిని కనికట్టు
ఉన్న లోపాలను కప్పిపెట్టు
గౌరవాన్ని, హుందాతనాన్ని కట్టబెట్టు!

అమ్మమ్మ కొంగుముడిలో అర్ధరూపాయి
నవవధువును పెనవేసిన బంధపుపురి
మమతల మడి అమ్మఒడి
బంధాల సుగంధాన్ని ప్రోది చేసి .. అలదుకున్న చీర!

మెత్తని పొత్తిళ్ళుగా మారి
పసిపాపకు ఊయలై.. నిదురబుచ్చే చీర!

దోబూచులాటకు మరుగై
సరసాల తెరచాపై
అనురాగపు గొడుగై
మురిపాల మడుగై
కళ్ళు తడిచిన వేళ సాంత్వనై
అంటిపెట్టుకును చీర!

ఆరుగజాల ఆత్మవిశ్వాసమై
భుజాల మీదుగా పెనవేసి.. భద్రతనిచ్చే చీర!

ప్రపంచం మెచ్చిన వస్త్రధారణ...
జాతీయ పతాకానికి సాటి యైన చీర
మన సాంప్రదాయాన్ని చాటిచెప్పే చీర!

తేదీ:4.11.2023

# 82. జీవన నైపుణ్యాలు

కష్టాలే వ్యక్తిత్వ పరీక్షలు
జీవిత పయనానికి శిక్షణలు
కష్టాన్ని ఇష్టంగా మార్చుకో
విజయాన్ని లక్ష్యంగా చేసుకో!

నీ బలహీనతలను తొలగించుకో
నీ బలాలేవో గుర్తించుకో
సమస్యలనే పరీక్షలకు
సరైన పరిష్కార
సమాధానాలు ఆలోచించు!

ఆత్మవిశ్వాసం ఆలంబనగా
కఠిన పరీక్షలు తట్టుకొని
జీవన నైపుణ్యాలు పెంపొందించుకున్నచో
నెగ్గగలవు జీవితపరీక్షలో!

తేదీ:5.11.2023

# 83. ఆనంద నర్తనం

ఆకాశవీధిలో నీలిమబ్బులు  కదలాడగా
మనోవీధిలో మధుర భావనలు
మెదలగా!

కోయిల గొంతెత్తి పాడగా
మయూఖము పురివిప్పి ఆడగా!

మలయమారుతం వింజామరై వీచగా
విరజాజుల తావి ఝుమ్మని నాసికకు  సోకగా!

శ్రావ్యమైన నాదం చెవిని తాకగా
చిటపట కురిసే చినుకులు తాళమేయగా!

కమ్మని కలలో దృశ్యం తెమ్మెరలా కమ్మగా
తీయని తలపేదో ఎదనూయలలూపగా!

మురిసిన మనసు తీయగా
కూనిరాగమేదో తీయగా
ఎర్రని పెదవులపై తెల్లని చిరునవ్వే పూయగా!

అనుకోని ఆనందం ఎదురవగా
పరవశించిన హృదయం ఆనందనర్తనం చేసె!

తేదీ:6.11.2023

# 84. మనీప్లాంట్

"నాన్నా... నాకది కావాలి...ఊ..." అనగానే
ఎప్పుడూ ఏదో ఒకటి అడుగుతూనే ఉంటావ్
"డబ్బులేమైనా చెట్లకు కాస్తున్నాయా?"
అనేవాడు నాన్న!

అమ్మ "పండక్కి నాకో కొత్త చీర కావాలండీ" అనగానే
"నెలకో పండగ... పండక్కో చీర
కావాలంటే ఎక్కన్నించి తేను?
డబ్బులేమైనా చెట్లకు కాస్తున్నాయా" అనేవాడు నాన్న!

ధర ఎక్కువున్న వస్తువులు అడిగినా
గొంతెమ్మ కోరికలేవి కోరినా
వాడుకునే వస్తువులు పాడు చేసినా
తినే ఆహారం వృధా చేస్తున్నా...
నాన్న గొంతు నుండి వెలువడేది మళ్లీ, మళ్లీ అదే మాట!

"మనింట్లో మనీప్లాంట్ ఉంది కదా...
మరి డబ్బులెందుకు కాయట్లేదు" అని నాకొకటే సందేహం!

అబ్బ! డబ్బులు కాసే చెట్టొకటి
మా ఇంట్లో ఉంటే ఎంత బాగుండేదో!

నాన్న మాట నిజమైతే
భలే బాగుండేది!

రోజూ అమ్మతో సహా మేమంతా
ఎంచక్కా డబ్బులు కోసుకుని
ఇష్టమైనవన్నీ కొనుక్కునేవాళ్ళం!

తేదీ:7.11.2023

# 85. ప్రియరాగాలు

మధువనులూ
మధురిమలూ
కలయికలూ కళకళలూ!

ఎడబాటుల్లో ఎద గాయాలు
నిశి రాతిరిలో  ప్రియరాగాలు
కనురెప్పల కౌగిలిలో కమ్మని కలలూ!

జీవితమా
దరి లేని సంద్రమా?
పయనమే ప్రయత్నమా?!

మునిమాపు వేళల్లో
ఒంటరి గమనాలు
తీరమేదో మొదలేదో తెలియదులే
చేయాలి ప్రయాణం
చేరాలి గమ్యం!

అలుపన్నదే లేక ఆనందంగా
ఆపదలే ఎదురైనా.. ఆటంకాలెదురైనా
ఆణిముత్యాలే ఏరుకోవాలిలే
అందమైన జీవితాన!

అంతులేని ఆకసాన
ఎన్ని పాలపుంతలో!
ఇంత చిన్ని జీవితాన
ఎన్ని ఎన్ని వింతలో!

తేదీ:8.11.2023

# 86. కనుమరుగైన నెలవు

చేపపిల్లల్లా తుళ్లే ఆటపాటల బాల్యానికి
కిలకిలలాడుతూ నడుమున బిందెతో
వయ్యారంగా నడిచే లలనామణులను వీక్షిస్తూ
చిలిపి ముచ్చట్లాడుకునే యువతకు
ఊరి సమస్యలను చర్చించే ఊరిపెద్దలకు
మకిలిపట్టిన దుస్తుల మురికిని
వదిలించే రజకులకు వేదికగా
నిలిచిన నాటి పల్లె చెరువుగట్టు!

ఊరి ఉనికికి ఆటపట్టు
ప్రజల దాహార్తిని తీర్చిన ఆయువుపట్టు!

పరుగులు పెట్టే పాలపిట్టలకు
కిలకిలలాడే పక్షి జంటలకు
ఆహారాన్నందించే జలవనరు!

బంగారు ధాతువును ఇముడ్చుకున్న
పోషకాల పొన్నగంటి కూర మొలిచే చోటు
నేడు మానవుని అత్యాశ ఉడుంపట్టుకు
బిగిసి కలుషితమైపోయి
కుంచించుకుపోయి!

చూపులకు కరువై
ఆనవాలే లేకుండా కనుమరుగై
అందమైన భవంతికి పునాదిగా మారిపోయింది!

తేదీ:9.11.2023

# 87. కలిసుంటేనే కద ప్రగతి

తెల్లవారకముందే కోడి కూయగనే లేచి
లేచి వాకిలంతా శుభ్రం చేసి
చేసి అందంగా ముగ్గులు వేసి
వేసి తీరున తీర్చి ఉంచుదురు పల్లెల్లో!

పల్లెల్లో కట్టెల పొయ్యి.. పొగతోనే తంట...
తంటాలు పడుతూ రుచికరంగా చేస్తారు వంట...
వంట వండి వడ్డించురందరికి ప్రేమగా!
ప్రేమగా ఇంటిల్లిపాదీ కలివిడిగ..
కలివిడిగా కలిసిపోయి చెలిమిగ..
చెలిమి కలిమిని కలిగి
ఉందురందరు మట్టిగుడిసెలోనున్నను... ఉన్ననాడు తిన్నను...
తినుటకు లేకున్ననూ సంతసముతో!

సంతసాల మురియు పాడిపంటల పల్లె
పల్లె మమతల మాగాణి ముల్లె
ముల్లెగా కట్టేరు మంచితనం మానవత్వంతో కలిపి!

మానవత్వంతో మసలుతూ
మంచిచెడులను విచారిస్తూ
అందరూ కలిసి చేయుదురు ఒకరింట్లో వేడుకను..
వేడుకను చేయుదురు  నిండు మనసుతో...
నిండు మనసుతో పనులు పంచుకుని
పంచుకుని అన్ని పనులు
చేయాలి  జనులందరు
జనులందరు కలిసుంటేనే కద ప్రగతి మన పల్లెల్లో!

తేదీ:10.11.2023

# 88. పలు వింతల ప్రవర్తనలు

ఏది బయట పెట్టాలో
ఏది దాచి ఉంచాలో తెలియని
బోళా మనస్తత్వాలు!

ఎదుటివాడి బాగును సహించలేక
సమాజంతో పాటు తాము మారలేక
తాము గిరి గీసుకున్న పరిధిలోనే బ్రతుకుతూ
కుల,వర్గ వైషమ్యాలతో కుళ్లే
బావిలోని కప్పల్లాటి సంకుచిత మనస్తత్వాలు!

ఎదుటివాడిని మాయమాటలతో
మోసం చేస్తూ
అవకాశం దొరికినప్పుడు తమ
అసలు స్వరూపాన్ని బయటపెట్టే
గోముఖ వ్యాఘ్రాల విపరీత మనస్తత్వాలు!

లేనివి ఊహించుకుని
గోరంతను కొండంత చేసి
ఎదుటి వారి సానుభూతిని కోరుకుంటూ
అభద్రతా భావంతో బాధపడే
ఆత్మనూన్యత కలిగిన మనస్తత్వాలు!

అహంతో మిడిసిపడుతూ
ఎవరినీ దరిచేరనీయక
ఒంటరితనంతో విపరీతంగా
ప్రవర్తించే విపరీత మనస్తత్వాలు!

బాల్యంలో జరిగిన చెడు
సంఘటనల ప్రభావంతో
వ్యక్తిత్వ నిర్మాణ లోపాలతో
మానసిక రుగ్మతలతో బాధపడుతూ
భావోద్వేగాలను నియంత్రించలేక
ఇతరుల జీవితాలను చిందరవందర
చేసే నేర మనస్తత్వాలు!

ఎన్నో వింత వింత మనస్తత్వాల మధ్య
తమకేమీ బంధం లేకపోయినా
ప్రతిఫలాపేక్ష లేకుండా పరులకు
చేతనైన సాయాన్ని చేస్తూ
తమకెన్ని కష్టాలు, బాధలున్నా
మోముపై చెక్కుచెదరని చిరునవ్వుతో
నిండుగా నవ్వే నిండు మనస్తత్వాలూ
ఉన్నాయ్ అక్కడక్కడా!

షడ్రుచుల పాకమే మధురం
పలు విధాల మనస్తత్వాలే ప్రపంచం
నవరసాల సమ్మేళనమే జీవితం!

తేదీ:11.11.2023

# 89. నీలో దీపం వెలిగించు

తిమిరం చెడుకు,నిరాశావాదానికి...
అజ్ఞానానికి, అధర్మానికి⋯
అపజయానికి, అన్యాయానికి,
దుర్మార్గానికి ప్రతీకైతే...

దీపం
మంచికి, ఆశావహ దృక్పథానికి,అంతరాత్మకు⋯
జ్ఞానానికి, వెలుగుకు...
ధర్మానికి, జయానికి⋯
న్యాయానికి, సన్మార్గానికి చిహ్నం!

తమసోమా జ్యోతిర్గమయ
చుట్టూ చీకటిని తిడుతూ కూర్చొనేకంటే
దీపాన్ని వెలిగించే ప్రయత్నం చేయి!

నీలో దీపం వెలిగించు
నీవే వెలుగై వ్యాపించు!

అధర్మంపై ధర్మం గెలుపుకు గుర్తుగా
చెడుపై మంచి విజయానికి చిహ్నంగా!

అంతరాత్మ బోధన పాటిస్తూ
అరిషడ్వర్గాలను తొలగించి
జ్ఞానజ్యోతిని వెలిగించి
పాపాలను హరించి
సన్మార్గంలో సాగేందుకు
దోహదపడే పండుగే దీపావళి!

తేదీ:12.11.2023

# 90. ఉత్ప్రేరకం

రుచికి గరళమే అయినా
పాలు, చెక్కర కలిపిన
మధుర పానీయమే!

కమ్మని పరిమళంతో కోల్పోయిన ఉత్తేజాన్ని తిరిగితెచ్చు
ఉదయాన సేవనం
రోజంతా పడబోవు శ్రమకు కలిగించు ఉత్సాహం!

అలసిన వేళల తెచ్చును నూతనోత్తేజం
అదేపనిగా తాగితే అనర్థదాయకమే!

తెల్లవారి చలువతో మనదేశంలోకి అడుగుపెట్టి
తెల్లవారే తప్పనిసరి సేవించాల్సిన
వ్యసనంగా పరిణమించిన కాఫీ
అతిథి మర్యాదల్లో ఆక్రమించింది మొదటి స్థానం!

వేడి వేడిగా పొగలు కక్కుతూ.. ఉదయాన్నే ఉత్తేజాన్ని అందిస్తూ
పనుల ఒత్తిడిని పక్కకు నెడుతూ
శ్రమజీవులకు తక్షణ శక్తినందిస్తూ
తలనొప్పిని తగ్గిస్తూ.. తాగకపోతే వెలితిని కలుగజేస్తూ
స్నేహాన్ని,ప్రేమలను కుదిర్చే

వారధిగా నిలిచే కప్పు కాఫీ.. మెదడుకు తాజాదనాన్ని
కలిగించేటి కప్పు కాఫీ!

కవులకు, సృజన కళాకారులకు
సైతం ఆలోచనలను తట్టిలేపే
ఉత్ప్రేరకంగా నిలిచే కప్పు కాఫీ!

తేదీ:13.11.2023

# 91. తెల్లని మల్లెల మనసులు

నల్లని మబ్బుల్లో దాగున్నవి
చల్లని నీటి మూటలు!

ఉల్లము ఝల్లున పొంగదా
చల్లని చిరునవ్వుల చూడగా!

తెల్లని మల్లెల మనసులు మీవి
అల్లరి చేష్టల ఆటలు మీవి!

తల్లిని తండ్రిని గౌరవించండి
చెల్లితో ప్రేమగ మసలండి!

కల్లలు ఆడుట తప్పు సుమా
పిల్లలు  రేపటిపౌరులు మీరు!

ఎల్లలు లేని చెలిమి మీది
చల్లగ నూరేళ్లు వర్ధిల్లండి!

తేదీ:24.11.2023

# 92. ప్రతి విద్యార్థీ ప్రత్యేకమే

బ్రతుకు తెరువుకేనా చదువు?!
డాలర్ల సంపాదనకేనా
ఈ పోటీ పరుగు?!
యజమానులుగా ఏలేవారే
ఉత్తమ విద్యార్థులా?!
స్వార్థం నిండిన సూపర్
బ్రెయిన్ లదేనా ప్రపంచం?!

ప్రతి విద్యార్థీ ప్రత్యేకం
వివిధ రంగాలలో ప్రతిభా
నైపుణ్యాలు వారి స్వంతం!

అందరికీ ఒకే పరీక్ష
ఫలితాలలో వివక్ష
ఆత్మన్యూన్యతకు గురై
చివరకు ఆత్మహత్య!

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని మేల్కొలిపి
వారి మైండ్ ఎనర్జీ బాక్స్ ను తెరిచి
కొత్త సిలబస్ ను బోధించి
ప్రయోగాలు చేయుటలో
మార్గదర్శకత్వం వహించి
సృజనాత్మకతకు చేయూతనిచ్చి
రేపటి భారతీయుల సామర్థ్యాన్ని గుర్తించి
దేశం కోసం పనిచేసేలా ప్రోత్సహించి
వెన్నుతట్టేదే సరైన విద్యావిధానం!

పాచిపోయిన పాత బోధనా
పద్ధతులను పారద్రోలి
పరిశీలన, అన్వేషణ ప్రాతిపదికలుగా
సరికొత్త సాంకేతిక విజ్ఞానం తోడుగా
అంధవిశ్వాసాలను తరిమే
శాస్త్రీయ దృక్పథం జోడుగా
పాదుకొలపాలి నూతన
విద్యావిధానాలను
విద్యా విధానకర్తలు!

అప్పుడే ఆవిర్భవింతురు
అబ్దుల్ కలాం వారసులు
సి.వి.రామన్ అనుచరులు!

తేదీ:15.11.2023

# 93. స్ఫూర్తిదాయకులు

అదనపు అవయవమే అయినా
అప్రయోజనకరమే అయినా
హాని చేయనిదే అయినా
జన్యులోపాల వలన పుట్టుకతో వచ్చినదైనా
తన తప్పేమీ లేకున్నా దాన్నే గుర్తింపు పేరుగా
అవకరంతో పొందే అవహేళనలెన్నో!

మెల్లకన్ను ఉంటే ఎదురొచ్చును అదృష్టం
పన్ను మీద పన్ను ఉంటే
ఎంతో అదృష్టం
అంటూ అవకరాలను సైతం
ఆదరించమంటూ పెద్దల
ఆత్మవిశ్వాసం కలిగించే ఉవాచలు!

ప్రతిభ తోడుగా
ఆత్మవిశ్వాసం జోడుగా
నైపుణ్యసాధన చేస్తే
అవకరంపై జనుల దృష్టి తొలగి
జయజయధ్వానాలతో
ప్రశంసలు దరిచేరు!

తమ లోపాలను సైతం
ప్రత్యేక అర్హతగా మలచుకుని
అందరిలో ప్రత్యేకంగా
నిలిచి గెలిచేవారే
సిసలైన కార్యసాధకులు
స్ఫూర్తిదాయకులు!

తేదీ:16.11.2024

# 94. రైతు మిత్రులు

అణువణువున గుడి ఉందంటూ
అందరిలోనూ దైవముందంటూ
ప్రకృతిలోని సమస్త జీవకోటిని ఆరాధిస్తూ
భూతదయను ఆచార సాంప్రదాయంగా
నిలిపిన భారతీయ సంస్కృతి!

పుడమి గర్భంలో నివాసముండి
భూసారాన్ని కాపాడుతూ
పంటలకు కీడు చేసే ఎలుకలను
సంహరించే రైతుమిత్రులు
నాగన్నలను పూజించే రోజు నాగుల చవితి!

తమలోని అరిషడ్వర్గాల విషసర్పాలను సంహరించి
శ్వేత తత్వ శాంతి సహనాలను ప్రసాదించమంటూ
కార్తీకమాసపు చలినుండి దూరం చేసి
ఉష్ణాన్ని అందించే చలిమిడి,చిమ్మిలి నైవేద్యాలతో
పుట్టలో కొలువైన నాగులను
భక్తితో పూజించే రోజు నాగుల చవితి!

అరగని పాలను పోసి అమిత భక్తిని చూపొద్దు
కనబడితే చాలు కర్రతో వెంటపడి
ఆత్మరక్షణకే తప్ప మానవులపై పగబట్టని పాముల
ఉనికికి భంగం కలిగించొద్దు
తలపై మణులుంటాయంటూ మూఢనమ్మకాలతో
మనుగడకు ముప్పు వాటిల్లనీయవద్దు!

తేదీ:17.11.2023

# 95. మనిషి గుర్తింపుకు ఆధారం

ఏ ఇద్దరికీ ఒకేలా లేనివి
కవలలకు సైతం వేరుగా ఉండేవి
తల్లి గర్భంలోనే రూపుదిద్దుకునేవి
జీవితాంతమూ చెరిగిపోనివి!
వలయాలుగా తిరిగిన చక్రాలు

ఏకచక్రే మహాభోగి
ద్విచక్రే రాజపూజిత
త్రిచక్రే లోకసంచారి
చతుశ్చక్రే  న పండితః
అంటూ చెప్పే జాతక చక్రాలకు కారణభూతాలు!

నేరస్తులను గుర్తించుటలో తోడ్పడేవి
ముఖ్య దస్తావేజులకు సంతకం కంటే ముఖ్యమైనవి!

మనిషి గుర్తింపుకు ఆధారమైనవి
నిరక్షరాస్యులకు గుర్తింపునిచ్చేవి
అరిగిన ముద్రలతో వయసు
మీరిన వారికి తిప్పలు తెచ్చేవి!

వేలు కాలినా మరల మొలుచు రేఖలు
ఓటు వేయునపుడు ముద్రించు గీతలు!

అసలు ముద్రలకు దీటుగా
నకిలీని గుర్తించలేనంతగా
నేరస్తుల మేధావితనానికి తార్కాణంగా
నిలుచు రబ్బరు,సిలికాన్ వేలిముద్రలు!

తేదీ:18.11.2023

# 96. మానవత్వమా! నీ జాడెక్కడ?!

అబలలపై, అమాయక ప్రజలపై
అమానుష కాండలెన్నాళ్లు?
అత్యాచార పర్వాలెన్నాళ్లు?!

కామాంధులకు అప్పచెల్లెళ్ళ
అభిమానం గుర్తుకు రాదెందుకని?
అపారమైన అమ్మ ప్రేమ అంతరంగంలో మెదలదెందుకని?!

అవనిజలా సహనం చూపినా
అంగన అంగడి బొమ్మలా చూడబడుతుందెందుకని?!
అన్యాయానికి గురవుతుందెందుకని?
అశ్రుధారా ప్రవాహాల జీవనం ఎన్నాళ్లని?!

అక్కడెక్కడో జరిగిందిలే
మనకెందుకనే అలసత్వం ఎందుకని?!
అల్లర్లు అణిగేదాకా..అల్లకల్లోలం సద్దుమణిగేదాకా
కంటితుడుపులే దేనికని?
సాక్ష్యాలు కాలి బూడిదయ్యాక
ఎవరేం చేస్తారనే ధీమా ఎన్నాళ్ళని?!

అసమానతలు,వివక్షలు అణిగేదెన్నడు?
అన్యాయానికి న్యాయం జరిగేదెన్నడు?
అక్కడికక్కడే తీర్పులిచ్చే అనుశాసనాలు లేవెందుకని?!

అంతర్జ్వలన అంతరంగాలు చల్లబడేదెప్పుడో
అఘోరాలకు అంతం ఎప్పుడో?
అతివ అస్తిత్వానికి విలువ అంకురించేదెన్నడో?!
మానవత్వపు జాడ కంటికి కనిపించేదెన్నడో?!

తేదీ:19.11.2023

# 97. తెర దిగియే తీరు

"రండి...మీ కోసమే మేమున్నాం"అంటూ
మైకుల్లో,ప్రచార మాధ్యమాల్లో ఊదరగొడుతూ
ఆదరించి ఆదుకుంటామంటూ
దేవాలయాలు, వృద్ధాశ్రమాల పేరుతో
చందాలు వసూలు చేసి
తమ బొజ్జ నింపుకునే
మాయోపాయాల మహేంద్రజాలికులు!

హృదయ విదారక ఛాయాచిత్రాలతో
చూసిన మనసుల్ని కకావికలు చేసి
పైసా వసూల్ అయ్యాక
ఆసాంతం మింగేసే అనకొండలు!

అనాథాశ్రమాలలోని పసిపిల్లల
అవయవాలు తెగ్గోసి అవతలి మనసుల
జాలి, సున్నితత్వాలను
క్యాష్ చేసుకునే మాఫియాలు!

"ఉపాధి ఇప్పిస్తాం
ఉచితంగా విమానం ఎక్కిస్తాం"
అంటూ మాయమాటల ఉచ్చులు పన్ని
అబలలను, బాలికలను
వదిలించుకోలేని ఊబిలోకి నెట్టేసే కర్కశులు!

"మీ సమస్యల్ని తీరుస్తాం"
మిమ్మల్ని ఇహలోకపు ఈ(తి)బాధలనుంచి
"కడతేరుస్తాం" అంటూ
ప్ర "వచనాలు"చెప్పే దొంగబాబాలు!

పదిమంది మెప్పుకోసం
తమ గొప్ప చెప్పుకోవడం కోసం
అన్నదానాలు,వస్త్ర దానాల
ఛాయాచిత్రాలతో
పదవుల కోసం తిప్పలు
పడే పటాటోపా(పీ)లు!

మాయమాటల ఆకర్షణలతో
అమాయకులను మాయజేసి
సానుభూతి కురిపించే ఆషాఢభూతుల,
రంగుహంగుల బహుమతుల ఆశ జూపే
“మేక”ప్ పులుల వీరంగాలు
సత్యం తేటతెల్లమయ్యేవరకే సాగు
జనం జాగృతమైననాడు
ఏనాటికైనా నాటకమున
తెర దిగియే తీరు!

తేదీ:20.11.2023

# 98. మానవతకు దర్పణం

గుండెలో తడి
కన్నుల్లో ప్రవహించి
కురిపించేదే కరుణ!

దీనుల ఎడ
దయగల హృదయమే
మనుషుల్లో దేవుని ప్రతిరూపం!

నరుడైనా,
అదృశ్య శక్తులైన నారాయణుడైనా...
అల్లా అయినా,ఏసు అయినా...
ఏ రూపమైతేనేమి
అంతా దయాసముద్రులే
అందరూ కరుణాంతరంగులే!
ఆపదలోనున్న వారికి మానసిక
చేయూత నందించేవారే
నేనున్నానంటూ అండగా తోడుండేవారే!

ఎదుటివారి బాధను కాంచి
కరుణాదరణతో, దయతో
స్పందించే హృదయమే
మానవతకు దర్పణం!

తేదీ:21.11.2023

# 99. కన్నుల విందు

హాయి గొలిపే శీతల పవనాలు
ప్రశాంత ప్రకృతికి తోడై!

వనభోజనాల వేళ
ఉసిరి చెట్ల నీడ
కరతలామలకమై!

కార్తీక పౌర్ణమి వేళ
చల్లదనాల జాబిల్లి
కళలొలికే అమృతమై!

ఆచారాలతో, పూజలతో
కల్లోల చిత్తము ప్రశాంతమై!

ఉపవాసాలతో
ఆహార నియమాలతో
ఆరోగ్యం భద్రమై!

సహజ దీపపు కాంతులతో
అలరారే కార్తీక శోభ
కన్నుల విందై!

తేదీ:22.11.2023

# 100. అక్షర సుమాలు

ఆలోచనల మస్తిష్క వనంలో
సాహితీ కొమ్మకు
భావాల రెమ్మకు పూసిన
కవిత్వ కాగితం పూలు
అజంత భాషలో
అరవిరిసిన అందాలతో అలరారుతూ!

రకరకాల భావోద్వేగాల రంగులతో
వివిధ ప్రక్రియల గుత్తులతో
సమూహాలలో విభిన్న అంశాల
వీచే గాలికి రెపరెపలాడుతూ
అంతర్జాల చదువరులను ఆకర్షిస్తూ!

తావి లేకుంటేనేం
చూపరులకు కనులవిందుగా
సామాజిక స్పృహ,
మానవత, భావుకతల సోయగాలతో
పూయించే తోటమాలులకు
రసానందాన్ని, ఆత్మతృప్తిని
కలిగించే అక్షర సుమాలు!

తేదీ:23.11.2023